honeybee.org
Vol-8 Issue-5

సంపుటి 8 సంచిక 5 జులై - ఆగష్టు 2020

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక









# బిందువు నుండి మంచు ముత్యాలు రావాలంటే ఆల్చిప్పలే కావాలా?



ఒకసారి ఒక చిన్న అల్లరిపిల్ల ఒక చెట్టుక్రింద చాలా దీక్షగా ఎండుటాకులతో ఆడుకుంటోంది. పక్కనే వున్న చిన్న నీటి గుంటలో పక్షులు కిలకిలా నవ్వుతూ స్నానం చేస్తున్నాయి. అది గమనించిన ఆ పిల్ల ఒక పక్షితో "బైట పెద్ద వేడిగా ఏం లేదు, ఎందుకు స్నానం చేస్తున్నావు?" అని అడిగింది. దానికాపిట్ట "బైట వేడిగా వుంటేనే స్నానం చెయ్యాలా? లోపల వేడిగా వున్నా స్నానం చెయ్యొచ్చుగా?" అన్నది గడుసుగా. చిన్నపిల్లకేమీ తోచలేదు. అయినా మాటల్లో ఓడిపోవటం ఇష్టం లేక "అది సరే పిట్టా, ఇది చెప్పు, శరీరంమీద వున్న తడి ఆరేంత వరకు రెక్కలు కొట్టుకోకుండా వుంటే ఎక్కువసేపు చల్లగా ఉండొచ్చు గదా" అంది తెలివైన దాన్లా. ఆ పిట్టమాత్రం తక్కువ తిందా "నీకు తెలుసా, నేను స్నానం చేసాక రెక్కలు విదిలిస్తే కొన్ని నీటి చుక్కలపైన సూర్య కిరణాలు పడి ముత్యాల్లా మెరుస్తాయి, ఇంకొన్ని చుక్కలు నువ్వు ఆడుకుంటున్న ఎండుటాకులమీద పడతాయి, మరికొన్ని స్నానం చెయ్యని మిగతా పిట్టలమీద పడి వాటినీ స్నానం చెయ్యమని ఉసిగొల్పుతాయి" అన్నది. ఇంకా ఏదో గుర్తుకొచ్చినట్టు "నీకు తెలుసా, నీటి చుక్కలు ఎండుటాకులపై పడి త్వరగా ఎరువుగా మారతాయి. నీటి చుక్కలు పడ్డ ఆకులు బరవు వల్ల గాలికి ఎగరకుండా మనం ఏ చెట్టుకింద్రైతే మాట్లాడుకుంటున్నామో ఆ చెట్టుకే ఎరువై బలాన్నిస్తాయి. ఇంకొన్ని నీటి చుక్కలు కిందపడకుండా గాలిలోనే ఆవిరైపోయి మాయమైపోతాయి. అవి ఎక్కడికి పోతాయో నీకు తెలుసా?" అని అడిగింది.

అల్లరి పిల్లకి మాట రాలేదు. దానికి తెలియలేదు, పోనీ మీకు తెలుసా?

**– హనీబీ 21(2) – జులై–సెప్టంబర్ 2010.**

Vol-8, Issue - 5 July - August 2020

## విషయ సూచిక

# పల్లెసృజన

సంపుటి-8 సంచిక - 5 జులై - ఆగష్టు 2020

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**రేగులగడ్డ కల్పనా శాస్త్రి**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 1,000/-**
**for 5 years Subscription**



సాంప్రదాయ వృత్తికారుడు 'విల్సన్' 3



10వ ద్వైవార్షిక పోటీ విజేతలు 7



జాతి యెరుగని వీరుడు 'రన్‌ఛోడ్‌దాస్ పాగి' 12



గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు 18



కలుపు నివారణ మందు 21



ఇతర రాష్ట్రాల 'పల్లె కబుర్లు' 22



డా. ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైట్–2019' పోటీ విజేతలు 26



ఆయుర్వేద జ్ఞాన మథనం– ఆహారం సగం బలం 30



స్పందన 32

**కవర్ లోపలి పేజీల్లో ...**

బిందువు నుండి మంచు ముత్యాలు రావాలంటే ఆల్చిప్పలే కావాలా?
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**

కొండాలు నాయక్ 'బైక్ ట్రాలీ' – ఇన్నోవేషన్‌కే ఇన్నోవేషన్ చేసుకుంటున్న రైతులు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# నాన్ రెసిడెంట్ విలేజర్స్ (ఎన్.ఆర్.వి.)

కరోనా సమయంలో గ్రామాలలోకి తిరిగి వచ్చిన వలసదారులు "వర్క్ ఫ్రం హోమ్" – ఇంటినుండే ఆఫీసు పనిలో భాగంగా స్వంత ఊర్లకు తిరిగి వచ్చిన ఉద్యోగులు ఒక రకంగా నమ్మశక్యం కాని విధంగా ఊరి వాతావరణానికి స్పందిస్తున్నారు. ఇదొక అద్భుతమైన సంఘటన. దీన్ని మనం తాత్కాలిక విషయంగా భావిస్తే పొరపాటు పడతామని మా ఉద్దేశ్యం.

ఈ సంవత్సరం మార్చి 24వ తేదీనుండి గడిచిన అయిదు మాసాలు వింత రోజులు. ఎప్పుడు ఏమవుతుందో ఎవరికీ తెలీదు. దినచర్యలు గుర్తు రానంతగా మారిపోయాయి. పనులన్నీ ఆగిపోయాయి. రోడ్లు ఖాళీగా ఉండిపోయాయి. మనుషులు కలవడం, తిరగడం మానేసారు. కార్లు గ్యారేజ్‌లో, మోటారు సైకిళ్ళు ఇంటిముందర, బస్సులు డిపోల్లో, ట్రక్కులు హైవే పక్కగా ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. రైళ్ళు, విమానాలు అసలెప్పుడైనా తిరిగాయా అన్నంతగా మన జీవితాల్లోంచి మాయమైపోయాయి. పట్టణాలు స్తబ్దంగా ఉండి పోయాయి. అన్ని పనులు ఆగిపోయాయి. కార్యాలయాలు, ఫ్యాక్టరీలు మూత పడ్డాయి. అత్యవసరమైనవి తప్ప అన్ని పనిచేయడం మానేసాయి. స్కూళ్ళు మూసేసారు. సందడిగా వుండే గుళ్ళు, హోటళ్ళు అన్నీ నిశ్శబ్దంగా నిలిచిపోయాయి. పట్టణాల్లో జీవితం పూర్తిగా ఆగిపోయింది. జీవితాన్ని బాగు చేసుకోవడానికి పట్టణాలకు వచ్చిన కోట్లాది గ్రామవాసులు ఒక్కసారిగా చైతన్యాన్ని కోల్పోయారు. ఏం చేయాలో, ఎవరిని అడగాలో, ఎన్ని రోజులిలా ఉండాలో తెలియని భయంకరమైన అనిశ్చిత పరిస్థితి. సమాజమంతా కరోనాలో ఇరుక్కోవడం వల్ల వారికి సహాయం చేయడానికి ఎవరూ లేరు. ఈ నిస్సహాయ, నిరాశతో కూడిన సమయంలో వారికి దొరికిన **ఒకే ఒక్కదారి "ఊరిబాట"**. తన గ్రామం, తన వాళ్ళు, తనని గుర్తించేవారు, ప్రేమించేవారు స్నేహితులు, బంధువులు అందరూ ఉన్న తన గ్రామమే వారికి గమ్యమనిపించింది. లక్షల్లో పట్టణానికి వలస వచ్చిన గ్రామవాసులు తిరుగు ప్రయాణం ప్రారంభమైంది. పట్టణాలు వారి అభివృద్ధికి తోడ్పడతాయని అనుకున్న వీరి ఆశలు కొద్ది రోజుల్లోనే పటాపంచలయ్యాయి.

బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తూ, పట్టణాల్లో నివసిస్తూ జీవితం గడుపుతున్న గ్రామవాసులు కూడా ఈ వింత పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. వారి పని ప్రారంభమైంది కానీ ఇంటినుండి చేయాలని అన్ని కంపెనీలు ఆంక్షలు పెట్టాయి. దాంతో వీరంతా తమ అద్దె ఇంట్లోనుండే పని చేయడం ప్రారంభించారు. కాని పరిసర ప్రాంతం అంతా కరోనాతో అనిశ్చితంగా ఉండటంతో వీరు కూడా తమ తమ గ్రామాలకు వెళ్ళడం జరిగింది. అక్కడినుండే "ఇంటినుండి పని" చేయడం మొదలెట్టారు. చాలామంది కుటుంబ వృత్తిలో తోడు చేయడం ప్రారంభించారు. వ్యవసాయంలో వేలమంది తమవంతు సహాయం చేస్తూ తమ అనుభవాన్ని, జ్ఞానాన్ని ఉపయోగించి చిన్న చిన్న ఇన్నోవేషన్లు చేయడం ప్రారంభించారు. ఒక ఇంజనీరు, మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్ కలిసి పిండిని (ఎరువు) సులభంగా, చక్కగా వృధా కాకుండా, అతి తక్కువ శ్రమతో పంటల్లో చల్లడానికి ఒక మంచి పరికరం తయారు చేసాడు. దీనికి కావాల్సిన అన్ని వస్తువులు గ్రామంలోనే లభిస్తాయి. దాన్ని వాడి వారిద్దరు యూట్యూబులో వీడియో పెట్టారు. స్కూల్లో చదువుతున్న చిరంజీవులు తమ తమ కుటుంబ వృత్తుల్లో పూర్తిగా తోడ్పడుతున్నారు. అమ్మాయిలు ఇంట్లో అమ్మకు సహకరిస్తున్నారు. ఊరంతా కళకళలాడుతుంది. కుటుంబాలు అంతా కలిసి పని చేసుకుంటున్నారు. కరోనా ప్రభావంతో తిరగడం పూర్తిగా తగ్గింది కావున జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. పట్టణంలో లేని స్వయం రక్షణ, చేయడానికి పని, ప్రకృతితో సహజీవనం, ఆరోగ్య సుస్థిరత వీరందరిని తాత్కాలికమైనా, ఆనందంగా నిశ్చింతగా జీవనం సాగించడానికి అవకాశం ఇచ్చింది.



మనుష్యులు ప్రకృతిలో ఒక భాగం. అందుకే ప్రకృతితో జీవనం గడిపినప్పుడే మానసిక ఉల్లాసం, శరీర ఆరోగ్యం అనుభవిస్తాడు. బహుశః ఇప్పుడు పల్లెల్లో ఇదే జరుగుతుందేమో. ఈ అధ్యాయం ఎన్నాళ్ళుంటుందో తెలియదు కాని పట్టణాల, గ్రామాల నిర్వచనాలు చాలావరకు మారినాయి. ఈ కరోనా సమయం మనందరికీ ఒక క్రొత్త అవకాశాన్ని ప్రసాదించింది 'అభివృద్ధి'కి పునర్ నిర్వచనం చేయాల్సిన గొప్ప అవకాశం. ముప్పైల్లో ఉన్న యువతరం కరోనా సృష్టించిన ఈ అవకాశాన్ని చక్కగా వాడుకుంటుందని, జీవన లక్ష్యాలను, సమాజ శ్రేయస్సును మరో దృష్టి కోణంలో చూస్తూ, ఒక క్రొత్త పంథాను దేశానికి అందజేస్తుందని మనసారా ఆశిద్దాం. అంతేకాక వారి తరువాతి తరాన్ని ఈ క్రొత్త పంథాలో పెంచుతారని, దాంతో వారి భవిష్యత్తు ఆనందమయంగా 'సర్వేజనాః సుఖినోభవంతు' అన్న వేదవాక్య స్ఫూర్తిగా ఉంటుందని నమ్ముతున్నాం.

మంచి వర్షాలతో పొలాలు పచ్చగా, పెరిగిన చెట్లతో, నిండిన చెరువులు, కాలువలు, కుంటలతో గ్రామాలు అందమైన ప్రదేశాలయినాయి. అక్కడ జీవిస్తున్న అందరికి ఆనంద ఆరోగ్య జీవితాన్ని ప్రసాదిస్తున్నాయి. అందరు శాంతిప్రదంగా జీవించెదరు గాక.

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)



# తరాల సంచార జీవితానికి చిరునామా సాధించిన
# సాంప్రదాయ వృత్తికారుడు 'విల్సన్'

- జమ్ములమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

ముప్పై సంవత్సరాల క్రితం (నేటికీ ఉన్నారేమో) గ్రామాలకు కొందరు సంచార జాతివారు వచ్చి గ్రామంలో ఒకచోట గుడారాలు వేసుకుని తమ అద్భుత కళాత్మకతతో రైతులకు తమ దైనందిన జీవితంలో ఉపయోగించుకునే చెర్నకోల కాములు, ఇతర పనిముట్లను ఎంతో అందంగా తయారు చేసి ఇస్తుండేవారు. నాడు వారికి కూలీగా డబ్బు ఇచ్చేవారు చాలా అరుదు. పెద్ద రైతులకైతే వారికి కావలసిన వస్తువులు తయారు చేసియిచ్చి, ప్రతిఫలంగా ఆ రైతు ఇంటికి వెళ్ళి వారి భృతిని ఆహార ధాన్యాల రూపంలో తెచ్చుకొనేవారు. అంటే బియ్యం, పప్పుదినుసులు, జొన్నలు లాంటివి. వారికి తమ ఊరు అని చెప్పుకునే చిరునామా కూడా ఉండేది కాదు. ఒకచోట నివాసం ఏర్పరచుకొంటే 15 నుండి నెల రోజుల వరకు అక్కడే వుండటం, ఆ తర్వాత మరో ఊరికి తమ నివాసం మార్చుకోవడం, అక్కడ తమ సేవలను అందించడం ఆ తర్వాత తట్ట బుట్ట సర్దుకుని మరో ఊరికి పయనమై పోవడం. ఇదే వీరి పని కాబట్టి వీరికి ఒక చిరునామా అంటూ ఉండేది కాదు.

అలాంటి సంచార తెగకు చెందినవాడే 'విల్సన్'. ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలులో స్థిరపడ్డ 40 సంవత్సరాల విల్సన్ తన తాతల కాలం నుండి తాను కూడా సంచార జీవితాన్నే గడిపాడు. పది సంవత్సరాల క్రితం తాను ఈ వంశ పారంపర్యక జీవితానికి స్వస్తి పలికి, తనకంటూ ఒక చిరునామా ఏర్పాటు చేసుకోవాలి, తాను తన పిల్లలు ఇక సంచార జీవులుగా ఉండకూడదు అనుకున్నాడు. తన కళతోనే రైతులకు, సాధారణ కుటుంబీకులకు అవసరమైన పరికరాలు తయారు చేసి తాను ఉన్నచోటు నుంచే వినియోగదారున్ని చేరుకునేలా ఏర్పాటు చేసుకున్నాడు.

అతని జీవన పోరాటం గురించి తెలుసుకుందాం.....

“విల్సన్ తాత మొదట్లో రిక్షా బండి లాగి జీవనం సాగించేవాడు. ఆయనకు నలుగురు కుమారులు కలగడంతో తన రిక్షా లాగటం వల్ల వచ్చే సంపాదన తినటానికి కూడా సరిపోయేది కాదు. దాంతో ఈ సంపాదన సరిపోదని కొలిమి పనులకు వెళ్ళేవాడు. అక్కడ కొన్ని సంవత్సరాలు చేయటం వల్ల ఆ పనులన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించి నేర్చుకోవడం జరిగిందట. ఆ తర్వాత తన నలుగురు కొడుకులకు కూడా ఈ కొలిమి పనిలోనే నైపుణ్యం పొందేలా శిక్షణ ఇచ్చాడు. అలా ఎన్నో అగచాట్లు పడి మొత్తానికి కుమారులు విద్య నేర్చుని ఒక్కోరు ఒక్కో ప్రాంతానికి వెళ్ళి గ్రామాల్లో కొలిమి ఏర్పాటు చేసుకుని, రైతులకు అవసరమైన పనిముట్లను అక్కడికక్కడే చేసి ఇస్తూ వుండేవాడు. ఈ వ్యవసాయ సంబంధ పనులు ఎక్కువగా సీజనల్ వ్యాపారాలు కావటం వల్ల అనువుగాని కాలంలో మళ్ళీ జీవితం దుర్భరంగా మారేది. అలాంటప్పుడు ఆ ప్రాంతంలో ప్రత్తి మిల్లులు ఎక్కువ ఉండటంతో ఆ మిల్లుల్లో కూలీ పనులు చేసుకుని కాలం వెళ్ళబుచ్చేవారు. సీజన్ వచ్చినపుడు సంచార జీవితం, అనువుగాని కాలాల్లో ప్రత్తి మిల్లుల్లో కూలీ పని ఇలా సాగిపోయేది.

యేరువాక సమయాల్లో పల్లెల్లో రైతుల పనిముట్లు చేసే పని కాబట్టి కాస్త ఊరట ఉండేది. గ్రామాల్లో రైతులు పని చేయించుకున్న తర్వాత ప్రతిఫలంగా వారికి భోజనాలు పెట్టడం లేదా తినటానికి భత్యం అందించటం వల్ల తిండికి ఢోకా లేకుండా ఉండేది. కొందరు చిన్న చిన్న రైతులు ఇచ్చిన

డబ్బు కాస్త  మిగుల్చుకునేవారు. గ్రామాల్లో రైతులకోసం వీరు వ్యవ సాయ పనిముట్లు అయిన గొర్రులు, గుంటకలు, చెర్నకోలలు, గడ్డపారలు, గొడ్డల్లు చేసి ఇవ్వటం, అప్పుడు పొలాలకు పురుగు మందు సరఫరా చేసే డబ్బాలు సిల్వర్ లోహంతో వచ్చేవి కాబట్టి ఆ లోహాన్ని కరగబెట్టి వాటితో చెర్నకోల కామలు, గృహాల్లో మహిళల కోసం గరిటలు, పట్టకారలు .... ఇలా ఎన్నో రకాల పనిముట్లు చేసి ఇస్తూ వుండేవారు. వారి తండ్రుల కాలం అయిపోయిన తర్వాత విల్సన్ కూడా కొన్ని సంవత్సరాలు ఇలాగే చేసుకుంటూ కాలం వెల్లబుచ్చేశాడు.

ఇక ఈ సంచారం చేసుకుంటూ ఎదుగూ బొదుగు లేని జీవితం ఎన్నాళ్ళు, ఒకచోట స్థిర నివాసం ఏర్పాటు చేసుకుందామని అప్పట్లో ఒకచోట స్థిరపడటానికి ఒక వెయ్యి రూపాయల సహాయం కోసం ఒకతన్ని సంప్రదించగా అతను ఇదిగో ఈ రోజు, రేపు అంటూ ఎన్నో రోజులు తిప్పుకుని ఆ వెయ్యి రూపాయలు అప్పు కోసం 20 – 30 రోజులు తిప్పుకుని, దాదాపు 600 ఖర్చు చేయించిన ఘనులు ఇతని జీవితంలో తారస పడ్డారు. అలా ఎన్నో ఆటుపోట్లకు గురవుతున్న సమయంలోనే 2000 సంవత్సరం జనవరి 1వ తేదీన విల్సన్ తండ్రి కూడా మరణించారు. అప్పుడు మట్టి ఖర్చులకు కూడా డబ్బు లేని పరిస్థితి. ఆ సమయంలో తాము పని చేస్తున్న కొందరు యజమానుల సహకారం వల్ల ఆ కార్యక్రమం పూర్తి చేయగలిగాడు. ఆ తర్వాత అదే సంవత్సరం డిసెంబర్ నెలలో విల్సన్‌కు వివాహం జరిగింది, వారికి ఇద్దరు పిల్లలు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి కలిగారు.



ఈ పరిస్థితుల్లో ఒంగోలులో ఒక చిన్న గది అద్దెకు తీసుకుని ఆ ఇంటి ముందున్న స్థలంలోనే కొలిమి ఏర్పాటు చేసుకుని పరికరాలు చేసి, వాటిని విక్రయించు కోవటం మొదలు పెట్టాడు. అలా అతని వ్యాపారం కాస్త కుదుట పడింది. తన జీవితంలో పడ్డ కష్టాలను గుర్తు పెట్టుకొని కొంత డబ్బు ప్రోగు చేసుకుని, ఆ ఇంటి సమీపంలోనే ఒకటిన్నర సెంట్ల స్థలం కొన్నాడు. ఆ స్థలం కొన్న కొద్ది రోజులకే ఇతను అద్దెకు తీసుకున్న ఇంటి యజమాని ఇతని ఎదుగుదలను చూసి ఓర్వలేకనో మరేదైనా కారణమో కాని వీరిని ఇళ్ళు ఖాళీ చేయించాడు. సరే తన స్థలం ఉంది కాదా అని ఆ స్థలంలో కొన్నిరోజులు తన కొలిమి పనులు కొనసాగించాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు ఆ పరిసరాల వారు కొలిమిలో వచ్చే పొగ వల్ల తమకు ఇబ్బంది కలుగుతుంది అని, జన్మరీత్యా నిమ్న కులంలో జన్మించిన ఇతని ఎదుగుదలకు ఆ రకంగా కూడా ఇబ్బంది పెట్టడం జరిగింది. అప్పుడు ఆ స్థలాన్ని కూడా అమ్మేసి ఊరికి దూరంగా, ఎవ్వరికీ ఇప్పట్లో ఇబ్బంది రాదు అనుకున్నచోట మరో స్థలాన్ని తీసుకున్నాడు. అక్కడే తన చిన్న కార్ఖానా ఏర్పాటు చేసుకున్నాడు. ఇక్కడ ఎవ్వరి ఇబ్బంది లేకపోవటంతో ఇంకా ఎక్కువ కష్టపడి ఉత్పత్తిని పెంచుకుని, విక్రయాలను కూడా పెంచుకున్నాడు.

ఆ తర్వాత తన స్థలం ప్రక్కనే మరికొంత స్థలం అమ్మకానికి రావటంతో కష్టపడి తాను దాచుకున్న డబ్బుతో ఆ స్థలాన్ని కూడా ఖరీదు చేశాడు. ఇప్పుడు మొత్తం స్థలంలో తన కార్ఖానాలో ఎక్కువ మొత్తంలో వ్యవసాయ, గృహోపకర పరికరాలను తయారు చేసి ఉభయ రాష్ట్రాల షాపు యజమానులకు విక్రయించడం ప్రారంభించాడు. క్రమంగా ఎదుగుతూ ఇప్పుడు అతని వద్ద 20 మంది పనివాళ్ళు వున్నారు. తన పిల్లలు ఇద్దరూ పదవ తరగతి చదువుకుం టున్నారు. ఇప్పుడు సీజన్‌లో అయితే రోజుకు పది వేల రూపాయల దాకా సంపాదిస్తున్నాడు. సీజన్ లేనప్పుడు కూడా తన ఆదాయం మూడు వేలకు తగ్గదని అంటాడు.

ప్రస్తుతం అతని వర్క్‌షాప్‌లో 20 దాకా యంత్రాలు ఉన్నాయి. అందులో ప్రధానమైనవి 'సమ్మెట' వేసే యంత్రాలు నాలుగు ఎప్పుడూ పని చేస్తూనే వుంటాయి. ఈ సమ్మెట యంత్రాన్ని మొదట్లో ఒకటి మార్కెట్లో సెకండ్ హ్యాండ్ యంత్రం కొనుగోలు చేసి పని చేసుకున్నాడు. ఆ తర్వాత దానికి తన తెలివి తేటలతో మార్పులు చేర్పులు చేసి తనకు



అనుకూలంగా మార్చుకున్నాడు. ఇప్పుడు అలాంటివి నాలుగు యంత్రాలు తయారు చేసుకుని తన వర్క్‌షాప్‌లో వాడుకుంటున్నాడు. వీటిని గమనించిన ఇదేరకమైన పని చేసే వారు ఇతని వద్ద ఈ సమ్మెట వేసే యంత్రాలను తమకు కూడా తయారు చేసి ఇవ్వమని కోరారు. అప్పటినుంచి విల్సన్ ఈ యంత్రాలను కూడా తయారు చేసి సరఫరా చేస్తున్నాడు. ఇప్పటికి ఐదారు యంత్రాలను అమ్మటం జరిగింది. తనకు తెలియకుండా తాను ఇన్నోవేటర్ అయ్యాను అని గర్వంగా చెప్పాడు విల్సన్. ఈ యంత్రం ప్రత్యేకత ఏమిటంటే మామూలుగా కమ్మరి కొలిమి వద్ద రైతులు తమ పరికరాలు చేసుకునేందుకు వెళ్ళినపుడు కొలిమిలో బాగా కాలిన ఇనుప ముక్కను సమ్మెట దెబ్బలతో రైతు పనికి అనువుగా మారుస్తారు. ఈ యంత్రం కూడా మనిషి సమ్మెటతో కొట్టినట్లే పని చేస్తుంది కనుక ఈ యంత్రం పట్ల మక్కువ చూపుతున్నారు.

విల్సన్ వర్క్‌షాప్‌లో ప్రత్యేకత ఏమిటంటే, కమ్మరి వారు సాంప్రదాయంగా చేసే అన్ని రకాల పరికరాల పనులనే యంత్రాలతో చేసి ఇస్తాడు. కాబట్టి ఆ పరికరాల నాణ్యత వేరు అంటాడీయన. ఇతను చేసే వస్తువులన్నీ కూడా అతుకులు, వెల్డింగులు లేక ఏకాండంగా ఉండటంతో మన్నిక ఎక్కువ. తాను మాత్రం ఇప్పటికీ రోజుకు కనీసం రెండు గంటల సేపు తాను మొదట్లో పని చేసిన కొలిమి పైన తప్పకుండా ఏదో ఒక పని చేస్తూనే వుంటాడట. ఇతను తయారు చేసే పరికరాలు కొలిమిలో నిప్పులపైన బాగా కాగి సమ్మెటతో తయారైన వస్తువులు కాబట్టి నాణ్యత ఎక్కువగా వుంటుంది అంటాడు. దీన్నే ఆధునిక యంత్రాలపైన పని చేసే వారు 'మెటల్ హార్డెనింగ్' అంటారు. అందుకే ఇతను తయారు చేసిన పనిముట్లకు ప్రాధాన్యత పెరిగి చాలా బాగా అమ్ముడు పోతున్నాయి. వీటిని సరఫరా చేసేందుకు ఎక్కడైనా వేలంలో లభించిన ముడి ఇనుము తరలించడానికి తానే ఒక చిన్న లారీని కొనుక్కున్నాడు.

తాము తయారు చేసిన కొడవళ్ళు, రకరకాల కత్తులు, గడ్డపారలు, పారలు, గొడ్డళ్ళకు మంచి గిరాకీ ఉందని, అందుకే ఖాళీ సమయాల్లో అటువంటివి ఎక్కువగా తయారు చేసి స్టాకు ఏర్పాటు చేసుకుంటూ వుంటామన్నాడు విల్సన్. కొడవళ్ళ పిడిని చేసుకునేందుకు కూడా బయటకు వెళ్ళకుండా దానికీ ఒక యంత్రాన్ని తయారు చేసుకున్నాడు. ఇలా చేసుకోవడం వల్ల అనవసరపు ఖర్చులు తగ్గి, వస్తువుల ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో వుంటాయి. చాలామంది వర్క్‌షాపుల యజమానులు తమద్ద తయారైన వస్తువులలో కొన్నింటినైనా బైటనుంచి తెప్పించుకుంటూ వుంటారు. కానీ విల్సన్ మాత్రం తాను తయారు చేసే ఏదైనా సరే మొత్తం తన వర్క్‌షాప్‌లోనే తయారు చేసేలా రూపొందించుకున్నాడు.

మీ జీవితం ఇప్పుడు ఎలా వుంది అని అడిగినప్పుడు విల్సన్ తన గతాన్ని నెమరు వేసుకుంటూ.... ఒకప్పుడు పెళ్ళయిన తర్వాత కూడా భార్యను పస్తు పడుకోబెట్టిన రోజులను కన్నీటి పొరల మాటున గుర్తు చేసుకుంటూ (మాట మారుస్తూ).... నిన్ననే రైల్వే శాఖ పాత సామాన్లు వేలం వేస్తుంటే నాకు అవి చాలా ఉపయోగ పడతాయి కాబట్టి వాటిని 20 లక్షలకు వేలం పాటలో కొన్నాను సార్ అంటూ వినయంగా చెప్తుంటే అతని కంఠంలో విజయ గర్వం 'పల్లెసృజన' బృందానికి కనపడింది. తన స్వయంశక్తితో కష్టపడి తన సంచార జీవితానికి స్వస్తి పలికి తనకంటూ ఒక స్థిరమైన చిరునామా కల్పించుకోవటమే కాక, సుమారు 20 కుటుంబాలకి నిర్దిష్టమైన జీవనాధారం కల్పించాడు.

మారుతున్న సమాజానికి తోడుగా సంచార వృత్తిలో జీవించే విల్సన్ సునాయాసంగా తనంత తానుగా లాభకరమైన 'ఒక్క స్థలం' పద్ధతికి తన జీవన విధానాన్ని సవరించుకున్నాడు. పరిస్థితులకు అనుగుణంగా మారటం, తనముందున్న వైపరీత్యాన్ని, కష్టాన్ని తనకు లాభంగా మలచుకోవడం, తరతరాలుగా వచ్చిన కళను మరవక దాన్నే ఆధునికతతో జోడించి ప్రజల అవసరాలను తీర్చడంతో పాటు తన జీవన సరళిని లాభదాయకంగా సమాజ సేవాభరితంగా మార్చుకున్న విల్సన్‌కు జోహార్లు. "ఈ అద్భుత సమయోచిత మార్పు"ను కొత్తతరం అర్థం చేసుకుని, మంచి పాఠాలు నేర్చుకుంటుందని పల్లెసృజన విశ్వసిస్తోంది.

**విల్సన్ ఫోన్ : 9959613154**



# ఇన్నోవేటర్లను వెతకటం (స్కాటింగ్) అంటే....

## స్కాట్ 'ఉప్పుతేళ్ళ కృష్ణ' అనుభవం

మిత్రులు, 'పల్లెసృజన' కుటుంబ సభ్యులందరికి శుభాభివందనములు. నా పేరు 'కృష్ణ' వాలంటీర్‌గా గత మూడు సంవత్సరాల నుండి పని చేస్తున్నా. ఇన్నో వేటర్లు – నా అనుభవాలను గురించి వివరించటానికి మీ ముందుకు వచ్చాను. ఇన్నోవేటర్లు చాలా అద్భుతమైన వారు. చదవటం, రాయటం వీరిలో చాలామందికి తెలియదు. హైస్కూలు చదువు చూసిన వారు ఏ కొద్దిమందో. ఈ ఇన్నోవేటర్లకు చదువు రాకపోవచ్చు, బస్సు నంబరు గుర్తించలేక పోవచ్చు, కానీ అద్భుతమైన మేధస్సు కలిగిన వారు. విషయం ఆకళింపు కలిగిన వారు. 'సంవేధన' అధికంగా కలిగిన వారు. ఇతరుల ఇబ్బందులే తనవిగా వాటికి పరిష్కారాలు వెతికేవారు. పనులలో తాము అనుభవించిన ఇబ్బందులు ఇతరులు పడరాదని ఒక ఇన్నోవేషన్ చేసేవారు. ఒక వస్తువును డిజైన్ చేసిన వారు, ఒక పద్ధతిని రూపొందించిన వారు. వారు లక్షలు పెట్టి చదువు 'కొనలేదు'. చిన్నప్పటినుండి తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా వుంటూ, ఇప్పుడు ఐదారు మందికి పని కల్పిస్తున్నారు, తిండి పెడుతున్నారు.

షేక్ బుడేసా ఎత్తు పెంచిన ట్రాక్టరుతో ఎత్తు పెరిగిన కంది, పత్తి లాంటి పైర్లలో కూడా స్ప్రేయింగ్ చేయవచ్చు. ఈ ఇన్నోవేషన్ వలన రైతుకు స్ప్రేయింగ్ ఖర్చు 30 నుండి 40 వేల వరకు తగ్గుతుంది.

అలాగే అద్భుతమైన వ్యక్తి 'జలీల్'. పనికిరాని కేబుల్ వైర్ల నుండి లోహం, ప్లాస్టిక్ వేరు చేయు పరికరం కనిపెట్టాడు. దీనివలన వాతావరణ కాలుష్యం ఎంతో తగ్గుతుంది. ఎట్లాగంటారా.... కేబుల్ వైరునుండి లోహం వేరు చేయాలంటే టన్నులు టన్నుల కేబుల్స్‌ను కాల్చే వారు. అందువలన ప్లాస్టిక్ కాలి, నల్లటి దట్టమైన పొగ వాతావరణాన్ని కాలుష్యం



చేసేది. ఇప్పుడు ఈ పరికరం కనిపెట్టడం వలన కేబుల్ వైరును కాల్చాల్సిన అవసరం లేదు.

మరొక ఇన్నోవేటర్ అబ్దుల్ ఇస్మాయిల్ 'సంచార పంచర్ రిపేరు వాహనం'కు రూపకల్పనదారు. ఈ రూపన కల్పదారు ఏంటంటే ఎవరైనా ప్రయాణం చేసేటప్పుడు టైరు పంచర్ కావచ్చు, దానికి స్టెఫ్నీ టైరు వుంటే మార్చు కుంటారు, హాయిగా చేరగలుగుతారు. కానీ స్టెఫ్నీ టైరు లేకుంటే వారి కష్టాలు వర్ణణాతీతం. అప్పుడు ఇస్మాయిల్‌కు ఫోన్ చేసినట్లయితే ఆయన అక్కడి నుండి 50 కిలోమీటర్ల దూరంలో ఎక్కడ వున్నా తన వాహనంలో వచ్చి ఆ పంచర్ చేసి తన కిరాయి తీసుకుంటాడు. ఈ కిరాయి తాను వెళ్ళిన దూరాన్ని బట్టి తీసుకుంటూ వుంటాడు.



అలాగే 'శివాజి' సంచార చెరుకు రసం విక్రయ వాహనం. అతను చిన్నప్పుడు సోడాలు అమ్మేవాడు. పెరుగుతున్న కొద్ది చెరుకు రసం విక్రయ కేంద్రం వాహనంగా మలుచుకొని ఎవరైతే ఆర్డర్ ఇస్తారో వారి ఫంక్షన్ దగ్గరికే పోయి చెరుకు రసం అమ్మటం మొదలు పెట్టాడు. అందువలన అతనికి ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది.

అలానే అద్దంకి బుజ్జి టివిఎస్ మోపెడ్‌ను మూడు చక్రాల భారీ వాహనంగా మార్చాడు. దీనివలన వ్యాపారస్తులు 50కిలోల నుండి ఒకటిన్నర క్వింటాలు దాకా సరుకులు, పళ్ళు, కూరగాయలు మార్కెట్‌కు తీసుకు వెళ్ళటానికి ఈజీ అయింది.

అలాగే విజయవాడ షేక్ ఖాదర్ లాగుడు రిక్షాకు స్కూటీ ఇంజన్ జత చేసి, ముసలివాళ్ళు కూడా 6 నుండి 7 వందల రూపాయలు సంపాదించుకునేలా చేశాడు. అలాగే చిలకలూరిపేట రవి స్కూటర్‌ను నీళ్ళక్యాన్లు మోసే వాహనంగా మార్చి, వ్యాపారం చేస్తున్నాడు. హాయిగా బ్రతుకుతూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్నాడు. పేరేచర్లలో 'శౌరీ' అనే అతను ప్రత్తి, మిరప సాళ్ళమధ్య తిరిగే అతి చిన్న ట్రాక్టరు తయారు చేశాడు. ఆ ట్రాక్టరుతో గొర్రు తోలవచ్చు, గుంటక తోలవచ్చు, మందులు స్ప్రేయింగ్ చేయవచ్చు, నీళ్ళ పంపు ఆడించుకోవచ్చు.

మరొక ఇన్నోవేటర్ 'ఇంకొల్లు కోటేశ్వర రావు' పురుగు మందులు పిచికారి చేసే అనేక రకాల ట్రాక్టర్లు తయారు చేశాడు. అలాగే చీరాల తిరపతిరావు కరెంటు స్తంభాలను ఎక్కడానికి ప్రమాద రహిత చెప్పులు తయారు చేశాడు. ఎంతోమంది కరెంటు స్తంభం ఎక్కుతూ జారిపడి వికలాంగులు అవుతూ వుంటారు. వాళ్ళందరినీ దేవుడిలాగా రక్షించిన వాడయ్యాడు.

ఇలా ఎందరో మహానుభావులు అందరికీ పాదాభి వందనములు. మన సమాజంలో ప్రతివారూ ఒక ఇన్నోవేటరే. ఇంట్లో తల్లి, తండ్రి. తల్లి సంతానం కడుపునిండా వుండాలని రకరకాల కొత్త వంటలు చేస్తూ నిస్వార్థంగా వుంటుంది. తండ్రి ప్రక్కవారికన్నా ఎక్కువగా పంటలు పండించాలని తపన పడుతూ వుంటాడు. కుమ్మరివారు, సాలెవారు, మేదర వారు, కమ్మరివారు అందరూ వారివారి వృత్తుల్లో ఇన్నోవేటర్లే. నిజాం కాలంలోనే సిగరెట్ పెట్టెలో పట్టేలా చీర నేశారంటే వారు ఎంత గొప్పవారు! కర్రు, గొర్రు, నాగలి, కొడవలి, ఉలి, బాడిశ... ఇవన్నీ కూడా ఒకనాటి గ్రామ ఇన్నోవేటర్లు కనిపెట్టినవే కదా, సృష్టించినవే కదా.

ఇకపోతే ఇన్నోవేటర్‌ను ఎలా గుర్తించడము? క్రొత్త ఇన్నోవేటర్‌ను కలుసుకోవాలనే తపన, ఓర్పు, ఒక సేల్స్ పర్సన్‌కు ఉండే నేర్పు, నైపుణ్యం ఉండాలి. వర్క్‌షాప్ ఓనరు ఇంటర్వ్యూ ఇవ్వటానికి రేపు రా, మాపురా అంటూ వారాలు వారాలు వాయిదా వేస్తుంటే నిరాశ చెందకుండా, ఓర్పుతో ఉండాలి. ఎదుటివారి మాటల్లో మమైక్యం అయ్యే నైపుణ్యముండాలి.

ఇన్నోవేషన్ల స్కౌటింగ్ యందు నాలుగు ముఖ్య ఘట్టాలు ఉన్నాయని నా భావన. అవి యేమిటంటే 1. ఇన్నోవేటర్‌ను వెతకడం, 2. ఇన్నోవేటర్‌తో కలయిక, కలసి సమాచారం ఇవ్వటం, సమాచారం గ్రహించటం. 3. సమాచార సేకరణ మరియు విశ్లేషణ, డాక్యుమెంటేషన్. ఇన్నోవేషన్ సమాచార సేకరణ యందు ఆ ఇన్నోవేషన్ ఎందుకు చేశారు, ఎప్పుడు చేశారు, ఎలా చేశారు, ఆ ఇన్నోవేషన్ ఎలా పని చేస్తుంది, లోగడ ఉన్నదానికన్నా ఇది ఎట్లా మెరుగైనది, ఎట్లా ఉంది, ఎలాంటి వస్తువులు వాడారు, సమాజానికి ఈ ఇన్నోవేషన్ ఎలా ఉపయోగ పడుతుంది అనేవి ముఖ్యమైన విషయాలు తరువాత 4. ఫోటోలు, వీడియోల సేకరణ. ఆ తర్వాత పై విషయాలు క్రోడీకరిస్తూ డాక్యుమెంటేషన్, పై ప్రక్రియయందు కష్టమంతా ఇన్నోవేటర్‌ను గుర్తించటంలోనే ఉంది. పేపర్ ద్వారా, టీవీల ద్వారా, వార్తలు వినటం ద్వారా, పాత ఇన్నోవేటర్‌లతో కమ్యూనికేషన్ సంబంధ బాంధవ్యాలు నెరపటం ద్వారా, ఎగ్జిబిషన్‌లో స్టాళ్లు ఏర్పాటు చేయటం ద్వారా, స్టాళ్లు దర్శించే వారినుండి వివరాలు సేకరించటం ద్వారా ఏరియా వైజ్‌గా, ప్రాంతాల వారీగా తిరగటం ద్వారా ఇన్నోవేటర్లు తారస పడతారు. ఒకాయన విజయవాడలో ఉండవచ్చు, రెండవ ఆయన కాకినాడలో ఉండవచ్చు, మరో ఆసామి అనంతపురంలో ఉండవచ్చు, తిరగాలి, తిరగాలి, అలుపు రాకుండా తిరగాలి. ఒక ఇన్నోవేటరు ఫలానా చోట ఉన్నాడని తెలిస్తే, ఫోన్ నెంబరు గనక తెలిస్తే, ఆ కలయిక విషయం తేలికగా జరుగుతుంది. ముందుగానే ఫోన్లో మాట్లాడుతాము, అప్రోచ్ అవుతాము, ఒక టైం ఫిక్స్ చేసుకొని కలుస్తాము. అదే ఫోన్ నెంబరు లేకపోతే, సర్చ్ చేస్తూ ఆ లొకేషన్‌కు వెళుతూ వుంటే, ఆ ఇన్నోవేటర్ గారు పనిలో మునిగి వుంటారు. మనతో మాట్లాడటానికి సమయమే ఉండదు. భోంచేసే సమయం కొద్ది సమయంలోనే 'పల్లెసృజన' గురించి చెప్పాలి, పల్లెసృజన పనుల గురించి చెప్పాలి. మనం చెప్పేవన్నీ విని, అర్థం చేసుకుని ఆయన తన ఇన్నోవేషన్ వివరాలన్నీ చెప్పాలి. ఈ వివరాలు చెప్పినా, ఫొటోలు, వీడియోలు మనకు ఇవ్వాలి. ఇన్నోవేషన్ రెడీగా వుంటే వీడియోలు, ఫొటోలు వస్తాయి లేకపోతే రోజులు పట్టవచ్చు. డాక్యుమెంటు పూర్తి కావటానికి నెలలు కూడా పట్టవచ్చు.

అయినా నాకు ఈ 60 సంవత్సరాల వయసులో ఈ పని చేయటం ఎంతో ఆనందంగా ఉంది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఆర్ & డి డిపార్ట్‌మెంట్లు, ఏసీ గదులు ఉన్నప్పటికన్నా స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన మనుషులు, వివిధ ప్రాంతాలు తిరగటం, వివిధ రకాల మనుషులతో కలవటం ఆనందంగా ఉంది. మన మల్లేశం... 'పల్లెసృజన' ద్వారా పైపైకి ఎదిగి, ఒక కమ్యూనిటీని బాగు చేసే స్థితిలో ఉన్నాడంటే, శ్రీశైలం చంద్ర శేఖర్ అతి తక్కువ ఖర్చుతో పంటలను చీడ పీడల నుండి రక్షించే సైడ్ ఎఫెక్ట్ లేని మందులు అందరికీ అందుబాటులోనికి తెచ్చాడంటే వీరి ద్వారా సమాజం పొందే మేళ్ళు గుర్తించే మేలును చూస్తూ వున్నపుడు గణేశం సారు, పల్లెసృజన టీం వారి కళ్ళల్లో ఆనందం చూస్తుంటే ఆ ఇబ్బందులన్నీ మర్చిపోతాం. వర్షం గుర్తుకు రాదు, ఎండ గుర్తుకు రాదు, ఒకటికి ఐదారుసార్లు తిరిగినా, తిరగి తిరిగి పడిన శ్రమ గుర్తుకు రాదు, ఆనందమే ఆనందం. ఇష్టమైన పని అయితే కష్టం అనిపించదు. ఇది సర్వదా సర్వదా నిజం. జైహింద్.

●

**ఉప్పుతేళ్ల కృష్ణ, ఫోన్ : 8919903118**



# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు

ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ బహుమతి పొందిన విజేతల వివరాలు

- జమ్మలమడక శశిమోహన్

**జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి**
**మల మూత్రాలు కూడా అనువుగా ఉండి, రిమోట్‌తో శుభ్రపరిచే ఏర్పాటు వున్న మంచం**

పేరు : **శరవణ ముత్తు**
నివాసి : నాగర్ కోయిల్, తమిళనాడు.



దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు, పక్కమీదనుండి లేవలేక మంచానికే పరిమితమైన వ్యక్తులు, ప్రతిరోజూ తాము మల మూత్రాలు విసర్జించడానికి, విసర్జించిన వాటిని శుభ్రం చేయడానికి చాలా శ్రమ పడాల్సి వస్తుంది. ఇది అనుభవించిన వారికి మాత్రమే అర్థమయ్యే విషయం. వారికి సహాయకారిగా ఉండటానికి ఆసుపత్రి స్థాయిలో పడకలు ఉన్నా, వాటి ఖరీదు వేలు, లక్షల్లో వుంటోంది.

తమిళనాడులోని నాగర్ కోయిల్ కి చెందిన 40 సంవత్సరాల శరవణ ముత్తుకి స్వంతంగా ఒక ఇంజనీరింగ్ వర్క్‌షాప్ ఉంది. తన భార్య, ఇద్దరు పిల్లలతో జీవించే ఇతను తండ్రివద్ద కార్ల రిపేరు చేసే పనిలో సహాయ పడుతూ క్రమేణా తానే కార్లు రిపేరు చేసే స్థాయికి ఎదిగాడు. తగ్గ అనుభవం సంపాదించి కార్ల రూపు రేఖలు మార్చే స్థాయికి ఎదిగాడు. ఇతనిప్పుడు తరచూ విద్యార్థులకి తనకు తెలిసిన విషయాలను బోధిస్తూ వాళ్ళ ప్రాజెక్టు పనులకి సహాయ పడుతున్నాడు.

కొంత కాలం క్రితం ఇతని భార్యకి ఒక పెద్ద శస్త్ర చికిత్స చేయించాల్సి రావటంతో ఆమె చాలా కాలం మంచంమీదనే కదలకుండా ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆమెను తన దైనందిక కార్యక్రమాలు, మల మూత్రాలు విసర్జన చెయ్యటంలో పడే ఇబ్బందులను ఇతను చాలా దగ్గరనుండి గమనించాడు. ఇతరుల సహాయం అడగటానికి కూడా సిగ్గుపడే పరిస్థితులవి. ఇదంతా అతను సునిశితంగా గమనించాడు. కేవలం గమనించి ఊరుకోకుండా తన భార్య అవసరార్థం ఆమె పడుకొని వున్న మంచానికే ఆమె కదలకుండా మల మూత్రాలు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశాడు. దాంతో ఆమె ఇతరుల సహాయం అర్థించకుండానే తన పని చేసుకో గలిగేది.

ఇతను 12 ఓల్టుల బ్యాటరీ, రెండు గేరు మోటార్లు ఉపయోగించి మలమూత్రాలు విసర్జించే కుండీ ఎటు కావాలంటే అటు జరిగేలా ఏర్పాటు చేశాడు. వాడిన తరువాత కుండీని శుభ్రం చేయడానికి ఒక రిమోట్ కంట్రోల్ కూడా అమర్చాడు. దీని సహాయంతో చాలా సులభంగా కుండీని శుభ్రం చేసుకొనే అవకాశం ఏర్పడింది.

ఈ మొత్తం ఏర్పాటు చెయ్యటానికి ఆయన కేవలం రూ. 35,000/–లు మాత్రమే ఖర్చు చేశాడు.

ఎందరో రోగులకి ఎంతో చవకగా ఈ సదుపాయం అందించిన ఇతనికి ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో తమ 10వ జాతీయ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన



పోటీలలో జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి ఇచ్చి సత్కరించారు.

**జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి**

**అభివృద్ధి చేయబడ్డ 'కాలీఫ్లవర్'**



పేరు :**సంజీవ్ కుమార్**

నివాసి : వైశాలీ జిల్లా, బీహార్.

బీహారు రాష్ట్రానికి చెందిన 36 సంవత్సరాల అభ్యుదయ రైతు సంజీవ్ కుమార్. ఇతను సాంప్రదాయ పద్ధతులలో కాలీఫ్లవర్, క్యాబేజీ, వంకాయ పంటలను పండిస్తూనే తన స్వంత ఆలోచన జోడించి ఈ పంటలను ఆధునిక పద్ధతులలో అభివృద్ధి పరచి ఎక్కువ దిగుబడి వచ్చేలా ప్రయోగాలు చేసి కృతకృత్యుడు అయ్యాడు. ఇతను ప్రత్యేకించి ఎక్కువ దిగుబడినిచ్చే, త్వరగా పంటకు వచ్చే క్యాలీఫ్లవర్ రకాన్ని రూపొందించి, దానికి 'సంజీవ్ సెలక్షన్' అని పేరు పెట్టుకున్నాడు. ఈ రకం చీడ పీడలను తట్టుకోవటమే కాక, పువ్వు తెల్లగా, ఒత్తుగా, బరువుగా ఉంటుంది.

సంజీవ్ కుమార్ 2009-2013 సం.ల మధ్యలో తాను పండించే సాంప్రదాయ కాలీఫ్లవర్ రకాలపైన ప్రయోగాలు చేసి త్వరగా కోతకు వచ్చేలా, ఒత్తుగా, బరువుగా తెల్లటి రకాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఎంపిక పద్ధతిపై రూపొందించాడు. తన ప్రయోగాల కృషి ఫలితంగా సంజీవ్ సెలక్షన్ రకాన్ని రూపొందించాడు. ఇది త్వరగా అంటే 60 నుండి 70 రోజుల్లో కాపుకి వస్తుంది. పెద్దగా, బరువుగా (940 గ్రా.) ఒత్తుగా ఉండి, హెక్టారుకి 175 క్వింటాళ్ళ పంట దిగుబడినిస్తుంది. ఇతనికి ఈ విషయంలో ఎన్.ఐ.ఎఫ్. వారు మరియు సాబూర్‌లో వున్న బీహార్ వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు ఎంతో సహకరించారు. వీరు సంయుక్తంగా మూడు ప్రదేశాలలో విడివిడిగా జరిపిన ప్రయోగాలలో పండించిన పంట అధికంగా అంటే హెక్టారుకి 186.2 టన్నుల దిగుబడి ఇవ్వటమే కాక ఒత్తుగా, తెల్లగా, బరువుగా ఉండి విటమిన్ 'సి' అధిక శాతంలో ఉండటం గమనించారు.

2018లో ఐసిఎఆర్ – ఐఎఆర్ఐ వారి స్థానిక విత్తన పరిశోధన కేంద్రంలో విత్తనాలను పరీక్షించగా 88.3% మొలకెత్తడమే కాక, స్వచ్ఛతలో 98.6%, 8.4 తేమ శాతం ఉన్నాయని నిర్ణయించారు. ఈ రకంగా సాంప్రదాయ రకాల కన్నా ఈ రకం ఎంతో మేలైనదని లాభసాటిదని సిఫారసు చేశారు. ఈ రకం అన్ని శీతోష్ణ పరిస్థితులలో పండించ గలమా అని ఎన్ఐఎఫ్ వారు ఆరు రాష్ట్రాలలో దీనిని వితరణ చేసి మరీ పరీక్షించారు. అన్ని రాష్ట్రాల నుంచి చాలా ప్రోత్సాహకరమైన ఫలితాలు వచ్చాయి. ప్రత్యేకించి బీహార్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌ఘడ్‌లలో చాలామంది రైతుల నుంచి త్వరగా కాపుకొస్తోందని, దిగుబడి ఎక్కువగా ఉన్నదని, 'మంచి మేలైనపంట' అని కితాబు లభించింది. బీహార్, ఉత్తరాఖండ్‌లలో ఈ రకం విరివిగా వ్యాప్తి చెందుతోంది.



సంజీవ్ కుమార్ గత నాలుగు సంవత్సరాలలో సుమారు 80 కిలోల విత్తనాలు విక్రయించాడు. ఈ రకాన్ని పిపివి & ఎఫ్ ఆర్ చట్టం 2001 క్రింద రిజిష్టర్ చెయ్యటానికి ఢిల్లీలో దరఖాస్తు చేయటం జరిగింది.

ఈ ప్రత్యేకమైన మేలైన కాలీఫ్లవర్ రకాన్ని రూపొందించినందుకు గాను సంజీవ కుమార్‌కి ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో తమ 10వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి ఇచ్చి సత్కరించారు.



**జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి**

**పశు వైద్యం (గొడ్డుపోవడం, సంతానోత్పత్తి చెయ్యలేక పోవడం)**

పేరు :విలాట్ యాదవ్

నివాసి : సీతామార్హి, బీహార్.



బీహార్ లోని 80 సంవత్సరాల విలాట్ యాదవ్ 7వ తరగతితో చదువు ఆపేసి, వ్యవసాయం చెయ్యటం ప్రారంభించాడు. పెద్దల దగ్గరనుంచి సాంప్రదాయ మూలికా వైద్యం నేర్చుకొని గత 25 సంవత్సరాల నుంచి తానే స్వంతంగా వైద్యం చెయ్యటం ప్రారంభించాడు.

పశువులలో సంతానో త్పత్తి కోరిక తగ్గిపోవటం, రెండు కాన్పుల మధ్య చాలా కాలం ఉండటం లాంటి సమస్యలకు ఈయన తానే స్వయంగా రూపొందించిన మూలికా మిశ్ర మంతో వైద్యం చేస్తుంటాడు. సంతానోత్పత్తి చెయ్యలేని పశువు లకి ఇతను తను స్వంతంగా తయారు చేసిన మూలికల పొడిని (25 గ్రాములు) రోజుకి రెండుసార్లు పపశువుకి నీటిలో కలిపి తాగిస్తాడు. ప్రత్యేక పరిశోధనకని చేపట్టిన 12 గోవులలో 9 గోవులు అంటే 75%, 12 రోజులలో (సరాసరి) సంతానోత్పత్తి లక్షణాలు కనిపించాయి. కృత్రిమ గర్భాధారణ పద్ధతుల ద్వారా చేపట్టిన తరవాత వాటిలో 5 గోవులు అంటే (తొమ్మిదింటిలో 5) 55% గర్భం ధరించినట్లు అల్ట్రాసోనోగ్రఫీ పరీక్షలో నిర్ధారణ అయ్యింది.

ఇదేవిధంగా 12 గేదెలకు జరిపిన ప్రయోగాలలో 11 గేదెలలో సంతానోత్పత్తి కోరిక జనించటం, కృత్రిమ సంతానోత్పత్తి ప్రయోగాల ద్వారా ప్రయత్నించగా11లో 9 గేదెలు అంటే 82% చూలుతో ఉండటం గమనించారు. ఈయన ఉపయోగించిన మందుల వివరాలు పేటెంటు దరఖాస్తు చేసిన కారణంగా చెప్పటానికి కుదరటం లేదు. స్థానికంగా ఎన్నో పశువులకు వైద్యం చేసి మంచి పేరు సంపాదించినందుకు గాను ఈయనకి 2019లో ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి ఇచ్చి సత్కరించారు. ●

# 'తక్కెళ్ల' ఆకుతో వైరస్‌కు విముక్తి



ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా, నకిరేకల్ మండలం రూపెనగుంట్లకు చెందిన తొండపి గురవయ్య అనే 80 సంవత్సరాల రైతు ఇన్నోవేటర్ పూర్వం తన అమ్మమ్మ గారు చెప్పిన పశువులకు మరియు మనుషులకు ఆరోగ్యంగా వుండేందుకు ఉపయోగించిన ఒక చిట్కాను తెలియజేస్తున్నారు.

వీరి పొలం గట్లవెంబడి 'తక్కెల్ల చెట్లు' వుండేవట. వీరి అమ్మమ్మ గారు ఆ ఆకును తెచ్చి పశువుల పేడతో చేసిన కళ్ళాపిలో కలిపి ఇంటిముందు చల్లేదట. నాడు ఇంట్లో బండలకు బదులు మట్టి నేల ఉండేది. ఆ నేలని వారానికి రెండుసార్లు పేడతో అలికే వారు. ఈ ఆకురసం కలిపిన నీళ్ళతో ఇంట్లో కూడా అలకటం వలన మహమ్మారి లాంటి వైరస్‌ను దూరంగా ఉంచటం సాధ్యమయ్యేదట. ఇలా చేయటం వల్ల పశువులకు గోమారి, కోడి గోమారి, పిరుదులు లాంటి ఏ క్రిములైనా సరే చనిపోయేవట. కోళ్ళకు, గొర్రెలకు ఇతర పశువులకు కూడా ఎలాంటి జబ్బులూ వుండేవి కాదట. ఇంట్లో పిల్లలకు, పెద్దలకు ఎవరికైనా జ్వరాలు వస్తే వెంటనే తక్కెల్ల ఆకు, పూత, పండ్లతో సహా తెప్పించి, వాటిని మెత్తగా నూరి కళ్ళాపిలో కలిపి ఇంటిముందు చల్లేదట.

ఈమధ్య 'కరోనా' రోగాల బారిన పడకుండా ఆ ప్రయోగం చేస్తే బావుంటుందని తాను కూడా ఇప్పుడు చేస్తున్నాడట. ఫలితాలు ఆశాజనకంగా వున్నాయని తెలియజేస్తున్నారు గురవయ్య గారు.

మీ తెలివితో బహుమతి గెలుచుకునే గొప్ప అవకాశం!

# "హనీబీ నెట్‌వర్క్" వారి జాతీయ స్థాయి పోటీలు

## హనీబీ నెట్‌వర్క్ క్రియేటివిటీ & ఇంక్లూజివ్ ఇన్నోవేషన్ అవార్డ్స్ (HBNCRIIA)

ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖలలో పనిచేసేవారు,
లేదా స్వంతంగా వ్యాపారం చేసుకొనేవారు
ఎవరైనా ఈ పోటీలలో పాల్గొనవచ్చు.
విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, వృత్తి నిర్వాహకులు,
కళాశాల విద్యార్థులు లేదా ఇంకేదైనా వృత్తి చేసుకొనేవారు
మీ ఆలోచనలని పంపవచ్చు.

కేవలం ఆలోచన మాత్రమే కాదు,
ఆ ఆలోచన పని చేస్తుంది అని నిరూపించే
మార్గం లేదా నమూనా పంపిన వారికి
ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుంది.



మీవద్ద
మనుష్యులకి కానీ,
పశువులకి కానీ,
సమాజానికి కానీ,
రోజువారి సమస్యల
పరిష్కారానికి కానీ
సృజనాత్మకతతో కూడిన
ఆలోచనలు, ఇన్నోవేషన్‌లు,
లేదా సాంప్రదాయ జ్ఞానం
ఉన్నదా?

బహుమతులు పొందిన వారి పేర్లు, మన పూర్వ రాష్ట్రపతి
భారతరత్న డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి
జన్మదినం **అక్టోబర్ 15, 2020**
నాడు ప్రకటించబడతాయి.
మీ ఆలోచనలు/ నమూనాలు
పంపాల్సిన చివరి తేదీ
**15 సెప్టెంబర్, 2020.**

మీ ఆలోచనలు
ఈ క్రింది లింక్
HBNCRIIA@honeybee.org
లేదా
https://bit.ly/HBNCRIIA
కి పంపండి.



ఇంకా వివరాలకు
మీ ఆలోచనలు,
సందేహాలని
ఈ వాట్సాప్
ఫోన్ నంబర్‌తో
సంప్రదించండి
**6353549783**

### పాకిస్తాన్‌పై యుద్ధంలో గెలుపుకి కారణమైన గొర్రెల కాపరి

# జాతి యెరుగని వీరుడు 'రన్‌ఛోడ్‌దాస్ పాగి'

# UNSUNG HERO: "RANCHHODDAS PAGI" A BRAVE SON OF INDIA





ఏమీ చదువుకోక పోయినా పెద్ద పెద్ద శాస్త్రవేత్తలు కూడా ఊహించని దైనందిక జీవిత సమస్యలకి పరిష్కార మార్గాలు, ఎంతో సాంప్రదాయ జ్ఞానమున్న సామాన్య గ్రామస్తుల కథలెన్నో మన 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలుసుకున్నాం. ఇప్పుడు వంశ పారంపర్యంగా, తరతరాలుగా వస్తున్న సాంప్రదాయ జ్ఞానం గల ఒక సామాన్య వ్యక్తి మన దేశం పాకిస్తాన్‌పై చేసిన రెండు యుద్ధాలలో గెలుపుకి ఎలా కారణమయ్యాడో తెలుసుకొందాం. ఒళ్ళు పులకరించే దేశ భక్తితో నిండిపోయే "రన్‌చోడ్‌దాస్" వీరగాథ యిది.....

మరి ఈ పైన ఉన్న చిత్రంలో చూస్తున్న గొర్రెల కాపరిగారే రన్‌చోడ్‌దాస్. ఒకప్పుడు గుజరాత్ ప్రాంతంలో భారతదేశ సైన్యానికి ఎనలేని సహాయాన్ని అందించిన ధీశాలి. అతని సాహసాలు వింటే సామాన్యులే కాదు, మిలటరీ అధికారులు సైతం గౌరవంతో 'శాల్యూట్' చేస్తారు, తలవంచి నమస్కరిస్తూ ఆయన్ని తలుచుకుంటారు.


అది 2008వ సంవత్సరం, దేశం యావన్మంది "సామ్"గా ఆప్యాయంగా పిలుచుకునే అత్యున్నత సైనికాధికారి ఫీల్డ్ మార్షల్ 'సామ్ మానెక్‌షా' తమిళనాడులోని వెల్లింగ్టన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోజులు. ఆయన స్పృహలోకి వచ్చినప్పుడల్లా "పాగి... పాగి" అని ఒక పేరుని తరచూ తలుచుకొనే వాడట. కుతూహలం ఆపుకోలేక ఆయన కొంత కోలుకోగానే డాక్టర్లు ఒకరోజు సార్ మీరు 'పాగి పాగి' అనేవారు ఎవరీ పాగి అని అడిగారట. అప్పుడు మానెక్‌షా గారు స్వయంగా చెప్పిన వివరాల ఆధారంగా ఈ కథ బైటకొచ్చింది.

యుద్ధం గెలిచిన తరవాత అంటే పాకిస్తాన్ ముక్కలై బంగ్లాదేశ్‌గా విడిపోయిన తర్వాత 1971 లో జనరల్ (అప్పుడు) మానెక్‌షా ఢాకాలో సైనికాధికారుల కోసం ఒక విందు ఏర్పాటు చేసి 'రన్‌ఛోడ్ దాస్'ని కూడా ప్రత్యేకంగా పిలవమని ఆదేశించారట. ఎడారి ప్రాంతంలో ఒంటెలమీద ప్రయాణం చేసే వారికి మార్గం చూపించేవాడు. రన్‌చోడ్‌దాస్‌ని మానెక్‌షా గారు ఆప్యాయంగా **పాగీ** అని

పిలిచేవారట. పాగీ అంటే 'గైడ్'. సరే ఇంతమంది అత్యున్నత మిలటరీ అధికార్లు హాజరయ్యే విందుకి ఒక సామాన్య వ్యక్తి పాగీని ఎందుకు ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారో! అని ఆశ్చర్యపోయినా జనరల్ గారి ఆదేశం కనుక రన్‌చోడ్‌దాస్ కై ఒక ప్రత్యేక హెలికాప్టర్‌ని పంపారు. ఆయనని ఎక్కించుకొని హెలికాప్టర్ బయలు దేరుతుంటే ఆయన చేతిసంచీ ఒకటి క్రిందనే ఉండిపోవటాన్ని గమనించి వెనక్కి వచ్చి దానిని కూడా తీసుకొన్నారు. మిలటరీ రక్షణ పద్ధతులను అనుసరించి ఆ సంచిలో ఏముందోనని చూడగా అందులో రెండు రొట్టెలు, ఒక ఉల్లిపాయ, శనగపిండితో చేసిన సంకటి ఉన్నాయి. విందులో మానేక్‌షా గారు ఈయనని అక్కడున్న సైనికాధికార్లకి పరిచయం చేస్తూ, ఈయన మూలంగానే మనం ఈ యుద్ధంలో గెలిచాం అని చెపుతూ....

ఉత్తర గుజరాత్ రాష్ట్రంలో పాకిస్తాన్‌తో మనకున్న అంర్జాతీయ సరిహద్దులో సుయ్‌గావ్ ప్రాంతంలో ఉన్న ఒక పోస్ట్‌కి "రన్‌చోడ్‌దాస్ పోస్ట్" అని పేరు పెట్టుకొన్నాం. ఈ విధంగా ఒక సామాన్య పౌరుడి పేరు పెట్టడమే కాక, అక్కడ ఈయన విగ్రహం కూడా ప్రతిష్టించామని చెప్పి... తనతో సమానంగా కూర్చోపెట్టుకొని ఆయన తెచ్చిన రొట్టె, ఉల్లిపాయలు తనూ పంచుకొని తిన్నారు.

గుజరాత్ రాష్ట్రంలో పాకిస్తాన్‌తో మనం పంచుకొనే ఎడారి ప్రాంతంలోని బనస్‌కాంతా జిల్లాలోని పాథాపూర్ ఘత్రాస్ గ్రామంలో నివసించే రన్‌చోడ్‌దాస్ గొర్రెలు, మేకలు, ఒంటెలు కాచుకొని బతికేవాడు. కాకపోతే ఈయనకి ఎడారి ప్రాంతం అయినా, రోడ్డు మార్గాలు లేకపోయినా ఎవరిని



ఎక్కడికి తీసుకుని వెళ్ళాలన్నా చాలా సులభంగా గమ్యం చేర్చేవాడు. పైగా ఇతనికున్న ప్రత్యేకత ఏమిటంటే ఒంటె కాలిగుర్తులు పరీక్షించి, దానిమీద ఎంతమంది వున్నారో, ఎంత బరువు తీసుకెలుతున్నారో కూడా చెప్పగలడు. మనుష్యుల కాలి గుర్తులు చూసి వారి వయస్సు, బరువు, ఎంత దూరం నుంచి వస్తున్నారు, ఎంతదూరం వెళ్ళారో కూడా ఖచ్చితంగా అంచనా వేయగలడు. ఇది ఈయన కంప్యూటర్ కన్నా ఖచ్చితంగా లెఖ్ఖ కట్టగలడు. వంశ పారంపర్యంగా వస్తున్న విద్యకి తన అనుభవం జోడించి నేర్చుకున్నాడీ ప్రత్యేక జ్ఞానం.

రన్‌చోడ్‌దాస్‌కి 58 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి ఆయన జీవితమే మారిపోయింది. ఆప్పుడు బనస్‌కాంత జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా వున్న వనరాజ్ సింగ్ ఝాలా గారు ఇతడ్ని పోలీస్ గైడ్‌గా నియమించారు. అక్కడ ఈయన దొంగతనాలు చేసి ఎడారి మార్గంలో సరిహద్దులు దాటి పారిపోయేవారిని పట్టించటంలో పోలీసులకి సహాయం చేస్తుండేవాడు. బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ వాళ్ళు "ఓల్డ్ వార్ కేమెల్" (యుద్ధంలో ఆరితేరిన ఒంటె) అని ముద్దుగా పిలుచుకునేవారు.

1965లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో గుజరాత్ లోని కచ్ బార్డర్‌లో 'విఢ్‌కోట్' అనే ప్రాంతాన్ని పాకిస్తానీ సైన్యం ఆక్రమించుకొంది. ఈ సమయంలో మన వీరసైనికులు 100 మంది దాకా వీరమరణం పొందారు. దీంతో ఆ ప్రాంతాన్ని తిరిగి చేజిక్కించుకోవాలన్న పట్టుదలతో పదివేల మంది భారత సైనికులని ఆ ప్రాంతానికి అతి త్వరగా పంపించాల్సి వచ్చింది. ఇలా అత్యవసరంగా ఎవరు ఈ సైనికులని ఎడారి మార్గం చూపించగలరు అని ఆలోచిస్తున్నప్పుడు మానేక్‌షా గారికి రన్‌చోడ్‌దాస్ పేరు గురుక్తి వచ్చింది. ఆయన ఇతడ్ని పిలిపించి, మనవాళ్ళని 3 రోజుల్లో చార్‌కోట్  అనే ప్రాంతానికి చేర్చాలి అని చెప్పి మిలటరీలో అప్పటి వరకు లేని పదవి "పాగీ" (పాద జ్ఞానం కలవాడు) అని సృష్టించి ఇతడ్ని నియమించారు. ఈయన కూడా ఎంతో చాకచక్యంగా ఎవ్వరికీ తెలియకుండా రహస్యంగా 12 గంటలు ముందే మన సైనికులని అక్కడికి తీసుకొని వెళ్ళాడు !!!

అంత స్వల్ప సమయంలో మన సైనికులను ఆ ప్రాంతానికి చేరవేయడమే కాక ఆ సరిహద్దు ప్రాంతంలో రహస్యంగా దాక్కొని వున్న 1200 మంది పాకిస్తానీ సైనికులని



వారి అడుగు జాడల ఆధారంగా ఖచ్చితంగా గుర్తించి చెప్పాడు. ఆ ప్రాంతాన్ని తిరిగి మన కైవసం చేసుకోవడానికి ఆ ఫ్రంట్‌లో యుద్ధం గెలవడానికి మన సైన్యానికి ఇది సరిపోయింది. ఈవిధంగా రన్‌చోడ్‌దాస్ పాగీ, భారత సైన్యం ఆ యుద్ధంలో గెలవటానికి ముఖ్య కారకుడు అయ్యాడు.

1971 యుద్ధంలో (మళ్ళీ పాకిస్తాన్‌తోనే) మన సైనికులకి మార్గాలు చూపించటమే కాక, వారికి ఆహారం, యుద్ధ సామాగ్రి, ఆయుధాలు సమయానికి అందించటంలో కూడా ఏమీ చదువుకోని గొర్రెల కాపరి మన భారత సైనికులకు సహాయం చేయటమే కాక, పాకిస్తాన్‌లోని పాలీనగర్‌లో మనదేశ త్రివర్ణ పతాకం ఎగరవెయ్యటంలో ముఖ్యపాత్ర పోషించాడు. దీనికి ఎంతో సంతోషించిన సాం మానెక్‌షా గారు తన జేబులోనుంచి అప్పటికప్పుడు (1971లో) 300 రూపాయలు ఇచ్చి పాగీ సేవలను ఎంతో కొనియాడారు.

ఆ తర్వాత కూడా చాలాసార్లు, మన భారతదేశ పోలీసులకి, సైన్యానికి పాగీ ఎంతో సహాయం చేశాడు. ఉదాహరణకి....

- 1998లో ముషారఫ్ అనే పేరుగల పాకిస్తానీ ఒంటెను 22 కిలోల ఆర్‌డిఎక్స్‌ని మన దేశానికి తరలిస్తుండగా పట్టించాడు.
- ఒక సంవత్సరం తరవాత 'భగత్ వారి' ప్రాంతంలో 24 కిలోల ఆర్‌డిఎక్స్, మరెన్నో మారణాయుధాలు మన దేశానికి దొంగచాటుగా తరలిస్తున్న పాకిస్తానీ చొరబాటు దారులని గుర్తించి, పెను ప్రమాదం నుంచి మనల్ని కాపాడాడు.
- రన్ ఆఫ్ హాజీపూర్ ప్రాంతంలో 46 కిలోల పేలుడు పదార్థాలు భూమిలో పాతిపెట్టివుంటే పట్టించి యిచ్చాడు.

ఈవిధంగా 1965, 1971 యుద్ధాలలోనే కాక, యుద్ధం లేని శాంతి సమయం (మనకి, పాకిస్తాన్‌కి శాంతి సమయం ఎప్పుడుందీ?) లో కూడా ప్రత్యక్షంగా పోలీసులకి, సైన్యానికీ, పరోక్షంగా దేశానికీ సేవ చేసిన రన్‌చోడ్‌దాస్‌కి **"సంగ్రామ్ మెడల్", "పోలీస్ మెడల్"** మరియు **"సమ్మర్ సర్వీస్ మెడల్"** లతో సత్కరించటం జరిగింది.

2007లో గుజరాత్‌లోని పాలన్‌పూర్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ గారు ప్రత్యేకంగా పాగీని సన్మానించారు.

ఈయనకి మనదేశం యిచ్చిన గౌరవంలో భాగంగా ఆయన చనిపోయే వారకు తన గ్రామంలో జాతీయ పతాకం ఈయన చేతులమీదుగానే ఆవిష్కరించబడేది. అంతేకాక ఈయన గ్రామానికి చెందిన ఈయనవద్ద తర్ఫీదు పొందిన అనేక మంది యువకులకి పోలీసు మరియు సైన్యంలో పాగీ ఉద్యోగం ఇవ్వటం జరుగుతోంది. వారంతా పాకిస్తాన్‌తో గుజరాత్ రాష్ట్రానికున్న 500 కిలోమీటర్ల ఎడారి ప్రాంతం సరిహద్దులను పరిరక్షిస్తున్న మన బిఎస్ఎఫ్ సైనికులకి సహాయపడుతున్నారు.

ఫీల్డ్ మార్షల్ సాం మానెక్‌షా 27 జూన్, 2008నాడు స్వర్గస్థులైనారు. మరుసటి సంవత్సరం అంటే 2009లో తన 108 సంవత్సరాల వయస్సులో పాగీ సైన్యంనుంచి స్వచ్ఛందంగా పదవీ విరమణ తీసుకున్నారు. (మేము సరిగ్గానే వ్రాశాము, మీరూ సరిగ్గానే చదివారు. 108 సంవత్సరాల వయసులో స్వచ్ఛంద పదవీ విరమణ) ఆయన అలా చేయకపోతే యింకా ఆ పదవిలో కొనసాగేవారేమో. దేశానికి ఎంతో సేవ చేసిన ఈయన 2013లో తన 112 ఏట తనువు








# जिसने 1200 पाकिस्तानी सैनिकों को धूल चटा दी

చాలించారు! ఇప్పటికీ, కేవలం గుజరాత్ రాష్ట్రంలోనే కాక ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో మన పాగీ రన్‌చోడ్‌దాస్ వీర గాథలు అనేక జానపద కళారూపాల్లో, నాటకాలలో ప్రదర్శిస్తుంటారు.

ఒక సామాన్య గొర్రెల కాపరి తన దేశభక్తి, ధైర్యం, శౌర్యం, త్యాగం, దీక్ష, పట్టుదలలతో భారత సైనిక చరిత్రలో "**భారతదేశం గర్వించదగ్గ ముద్దుబిడ్డ**" గా తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకొన్నాడు. 'పల్లెసృజన' అందుకే అంటుంది 'ఏం చదివారన్నది కాదు, ఏం చేశారన్నది ముఖ్యమని. **"జైహింద్"**

## ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 1,000/-లతో 5 సంవత్సరాల పాటు గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.




మీ గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక మీ గ్రామానికి వచ్చే ఏర్పాటు చేస్తారు.

చందా వివరాలు ఈ పత్రిక చివరి కవర్ పేజీలో ఇవ్వటమైనది. వీలైనన్ని ఎక్కువ గ్రామాలకు పత్రిక వెళ్ళేందుకు సహకరించ వలసిందిగా కోరుతున్నాము.

-ఎడిటర్

# కొండాలు నాయక్ 'బైక్ ట్రాలీ'

## ఇన్నోవేషన్‌కే ఇన్నోవేషన్ చేసుకుంటున్న రైతులు





గుంటూరు జిల్లా మార్టూరుకు చెందిన మన ఇన్నోవేటర్ 'కొండాలు నాయక్' గత ఒకటిన్నర సంవత్సరాల నుండి 'మోటార్ సైకిల్ ట్రాలీ' తయారు చేయటం ద్వారా ఎంతోమంది రైతులకు గ్రామీణ రవాణా వ్యవస్థకు కొత్త రూపును తీసుకు వచ్చాడు. ఇతను తయారు చేసిన ట్రాలీ చిన్న మోపెడ్ అయిన టివిఎస్-50 నుండి మినీ ట్రాక్టర్ వరకు ఉపయోగించుకుని రైతులు తమతమ పొలం పనులకు అవసరమైన కూలీలు, ఎరువులు, ధాన్యం, పశువుల మేత లాంటి ఎన్నో రకాల రవాణా పనులను చేసుకుంటున్నారు. కేవలం ఒకటిన్నర సంవత్సరాల్లోనే కొండాలు ఇప్పటికే 50కి పైగా ట్రాలీలను తయారు చేసి విక్రయించాడు. ఈ ట్రాలీలు తయారు చేయటం మొదలు పెట్టినప్పటి నుండి, పల్లెసృజన సహకారంతో, రైతాంగం అభిమానంతో తన జీవితం సాఫీగా సాగుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

కొండాలు ఇటీవల విశాఖ పట్నం సమీపంలోని నర్సీపట్నంకు చెందిన రైతు శ్రీనివాస రావు గారికి తన ట్రాలీని విక్రయించడం జరిగింది. శ్రీనివాస రావు గారు వికలాంగుడైనా ఎంతో ఉత్సాహంతో వ్యవసాయం చేసుకుంటున్న రైతు. ఈ ట్రాలీ చూడగానే తనకు బాగా నచ్చడం, తన అవసరాలకు బాగా వినియోగ పడుతుందని అనుకున్నాడు. అంతటితో ఆగకుండా తాను దీంతో మరో ప్రయోగం చేశాడు. తనవద్ద ఒక వీడర్ ఉంది. దాన్ని పొలం











వద్దకు నడుపుకుంటూ తీసుకు వెళ్ళాల్సి వచ్చేది. మనిషి నడుచుకుంటూ వెళ్లటం వల్ల దూరంగా వున్న పొలం వద్దకు వెళ్ళాలంటే ఎక్కువ ఆలస్యం అవుతుంది, పైగా అంత దూరం నడుచుకుంటూ వెళ్ళాలి కదా అని ఈ ట్రాలీని తన వీడర్‌తో అనుసంధానం చేసి, దానిపైన నిలబడి వీడర్‌ను నడుపుకుంటూ త్వరగా వెళ్ళే ఏర్పాటు చేసుకున్నాడు. ఆ వీడర్‌పైన మరియు ఒక్కోసారి మోటార్ సైకిల్‌కు ఈ ట్రాలీని తగిలించుకుని పొలానికి కూలీలను చేరవేయటం వల్ల ఎంతో ఖర్చు మిగులుతోంది అంటాడు శ్రీనివాస రావు (ఫోన్ నెం. 9951251949). ఈ ట్రాలీ తీసుకోవటం వల్ల నాకు చాలావరకు అనవసరపు ఖర్చులు కలిసి వచ్చాయి అంటున్నాడు.

ఈవిధంగా రైతు శ్రీనివాసరావు ఇన్నోవేటర్ కొండాలు ఇన్నోవేషన్‌కే తాను మరో ఇన్నోవేషన్‌ను ప్రేరేపించినట్లయింది. వీరు చేసిన ఈ ప్రయోగంతో ప్రస్తుతం మన ఇన్నోవేటర్ల నుండి వందలాది (బహుశా వేలల్లో కూడా ఉండొచ్చేమో) వీడర్లు కొనుగోలు చేసిన రైతులు కూడా ఈ ట్రాలీని తీసుకున్నట్లయితే మీ వీడర్ పొలం పనులకే కాకదు, ఎద్దుల బండిలా మీ పంటల రవాణాకు, కూలీలు, ఎరువుల రవాణాకు కూడా ఉపయోగ పడుతుందని.

భువనగిరి సమీపంలోని ఒక రైతు శ్రీనివాస రెడ్డి తనకు కూడా ఈ ట్రాలీ చాలా అవసరం అవుతుందని, తన పొలం ఊరికి చాలా దూరంలో వుంటుంది, కూలీలను చేరవేయటానికి ఇంతకన్నా చవకైన మార్గం మరోటి కనిపించడం లేదు అని తెప్పించుకున్నాడు. తీరా ట్రాలీ వచ్చిన తర్వాత ఓ ప్రయోగం చూద్దామని తనవద్దనున్న చిన్న ట్రాక్టర్ (మినీ ట్రాక్టర్)కు ఈ ట్రాలీని తగిలించి చూడగా ఎక్కువ ఖరీదు పెట్టి చిన్న ట్రాక్టర్లకు ట్రాలీలను తయారు చేయించుకునే బదులు ఇదే వుంటే సరిపోతుంది కదా, మనకు అవసరమైనప్పుడు ఎక్కువ మోతాదులో కాకుండా తగిన మోతాదులో ఒక్కసారి చేసే పనిని రెండుసార్లు తోలుకుంటే సరిపోతుంది. అంతంత ఖరీదు పెట్టి పెద్ద పెద్ద ట్రాలీ తీసుకునే బదులు ఇదే తనవద్దనున్న మోటార్ సైకిల్, వీడర్‌లతో పాటు చిన్న (మినీ) ట్రాక్టర్‌కు కూడా దీనినే ఉపయోగించుకుని, ముఖ్యంగా రైతు కూలీలను చేరవేయటానికి ఎంతో ఉపయుక్తంగా ఉందని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

తాను రూపొందించిన ట్రాలీ తనకు తెలయకుండానే ఇంతమంది రైతాంగానికి ఎన్నో విధాల సహకరిస్తున్నందుకు తనకెంతో సంతోషంగా వుందని, ఆర్డర్లు విరివిగా లభించినట్లయితే దాని ఖరీదు కూడా ఇంకా తగ్గించే అవకాశం వుంటుందని, ప్రభుత్వం లేదా స్వచ్ఛంద సంస్థలు తనకు కొన్ని యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహకారం అందించినట్లయితే ప్రస్తుతం అమ్ముతున్న ఖరీదుకన్నా ఇంకా తక్కువ ఖరీదుకే ట్రాలీని అందించ గలను అంటున్నాడు 'కొండాలు నాయక్'.

**కొండాలు నాయక్, ఫోన్ : 75569644707** •





# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అధిక దిగుబడినిచ్చే 'బల్వాన్' ఉల్లి రకం

### సమస్య – పరిష్కారం :



ఉల్లి పంట రైతును ధనవంతుడ్ని చెయ్యగలదు. అదే ఉల్లి రైతును బికారి కూడా చెయ్య గలదు. ఒక్కోసారి పంటను మార్కెట్‌కు లారీలో తరలిస్తే దాని కిరాయి కూడా లభించని స్థాయికి రేటు పడిపోతుంది. అలాగే ఒక్కోసారి ఆ ఉల్లి పంట ద్వారా వచ్చే డబ్బు మరే పంటలోనైనా సరే రావటం అసాధ్యం. కాజు (గోడంబి/ జీడిపప్పు) పంట లాంటి సుగంధ ద్రవ్యాలు పండించినా అంతటి ఆదాయం రాదు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. దీనికి కారణం ఉల్లిని ఎక్కువ రోజులు రైతులు నిలువ చేసే అవకాశం లేక పోవటం. నిలువ చేసే అవకాశం లేదు కాబట్టి పంట కోసిన వెంటనే మార్కెట్‌కు తరళించాలి. అప్పుడు ఆ రైతు అదృష్టం మావుంటే మంచి ధర లభిస్తుంది, లేదా నష్టపోవాల్సి వస్తుంది.

ఈ సమస్య పరిష్కారం కనుగొన్నాడు 'బల్వంత్ సింగ్' అనే రైతు. హర్యానాలో గత ఎన్నో సంవత్సరాలుగా బల్వంత్ సింగ్ ఉల్లిగడ్డను పండిస్తూ వుండేవాడు. దిగుబడి సరిగ్గా రాని కారణంగా దిగుబడిని పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. స్థానికం గా లభించే రకాలలో మంచి రకాన్ని సేకరించి, అనేక ప్రయత్నాలు చేసి, పది సంవత్సరాల సుదీర్ఘ ప్రయత్నాల తర్వాత చివరికి 1984లో ఒక రకాన్ని స్థిరీకరించి, దానికి 'బల్వాన్ ఉల్లి' అని నామకరణం చేశాడు. ఈ రకాన్ని స్థిరీకరించడానికి అతను ఉపయోగించిన ముఖ్య సూత్రాలు మూడు. 1. ఉల్లిగడ్డ మంచి సైజులో ఉండాలి, 2. పైపొర త్వరగా తీయటానికి రాకుండా ఉండాలి. అలా త్వరగా రాకుండా ఉన్నట్లయితే త్వరగా ఎండిపోదు. 3. మంచి ఆకర్షణీయమైన ఎర్రని రంగు కలిగి వుండాలి.

### ప్రత్యేక లక్షణాలు :

- పైపొర గట్టిగా గడ్డను అతుక్కొని ఉండటం వలన లోపలి పొరలు త్వరగా ఎండిపోవు.
- లోపలి పొరలు మందంగా ఉంటాయి.
- గడ్డ ఏకంగా ఒకే కుదురుగా వుంటుంది. భాగాలు (పాయలు)గా ఉండదు.
- సాధారణంగా వచ్చే కాండం కుళ్ళు తెగులును సమర్థవంతంగా ఎదుర్కొంటుంది.





❀ విత్తనాలు 98% వరకు మొలకెత్తుతాయి.

**వాతావరణ అనుకూలత :**

సాధారణ వాతావరణం అనుకూలం (సమతల వాతావరణం). వార్షిక వర్షపాతం 750 నుండి 1000 మి.మీ. చాలు.

**ఇతర లక్షణాలు :**

ఒక ఏడాది వరకు గడ్డలను నిల్వ చేసుకోవచ్చు. అలా నిల్వ ఉంచుకునే అవకాశం వుంది కనుక మార్కెట్‌లో ధర తక్కువగా వున్నపుడు అనుకూలమైన ధర వచ్చే వరకు నిల్వ చేసుకునే అవకాశం వుంటుంది. త్వరగా ఎండిపోదు కాబట్టి ఎక్కువ తరుగు వచ్చే అవకాశం ఉండదు. నిర్ణీత కాలంలో వేసుకునే పంట.

**విత్తేందుకు అవసరమైన విత్తనాలు :**

విత్తనాలు ఎకరాకు 2 కిలోలు అవసరమౌతాయి.

**దిగుబడి :** ఎకరాకు 200 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది.

**పంట కాలం :** 140–145 రోజులు.

ఇన్నోవేటర్ : **బల్వాన్ సింగ్,** హర్యానా. విత్తనాలు కావలసిన వారు పల్లెసృజనను సంప్రదించి పొందవచ్చు.

## వేరుశనగ త్రవ్వి తీసే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

వాణిజ్య పంటలలో వేరుశనగది ప్రథమ స్థానమనే చెప్పుకోవచ్చు. దీన్ని ప్రధాన పంటగాను, కందితో మిశ్రమ పంటగాను రైతులు సాగు చేస్తున్న విషయం అందరికీ విదితమే. ఈ పంట సాగుకు పడే కష్టానికి దాదాపు రెట్టింపు కష్టం పంట కోతకు పడుతుంది. దీనికి ప్రధాన కారణం కూలీలు లభించకపోవడం, ఒకవేళ లభించినా అధిక మొత్తంలో చెల్లింపులు. పర్యవసానంగా ఈ పంట సాగులో పెట్టిన ఖర్చులకి తగ్గ ఫలితం రావటం లేదు. దీనికి పరిష్కారంగా వేరుశనగ కాయలనును భూమినుండి తీయటానికి గుజరాత్‌కు చెందిన "సంజయ్ కుమార్ డి. తిల్వా" అనే రైతు ఒక పరికరం తయారు చేశాడు.



### పరికరం :

ట్రాక్టర్‌తో అనుసంధానం చేసుకుని పని చేసే ఈ పరికరం 540 లేదా 1000 ఆర్‌పిఎం వేగానికి అనువుగా తయారు చేయబడింది. ఈ పరికరం వేరుశనగ చెట్లను భూమినుండి త్రవ్వి తీస్తుంది. తీసిన మొక్కలు ఒక కన్వేయర్ బెల్టు ద్వారా వెళ్తూ ఆ కన్వేయర్ బెల్టులోని కుదుపులకు వేరుశనగ కాయలకు అంటుకుని వున్న మట్టి పూర్తిగా రాలిపోతుంది. ఈ శుభ్రమైన కాయలు చెట్టుతో సహా త్రెషర్‌లో వేసి కాయలను చెట్టునుండి వేరు చేయబడుతుంది. దీనివల్ల వేరుశనగ కాయలు మట్టిలేకుండా నాణ్యంగా వుండటం వల్ల మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది.

### సాంకేతిక వివరాలు :

❀ ఈ యంత్రం ఉపయోగించటానికి గంటకు ఒక లీటరు డీజిల్ ఖర్చవుతుంది.

❀ 35 హార్స్‌పవర్‌ల శక్తిగల ట్రాక్టర్‌తో దీన్ని అనుసంధానం చేసుకోవచ్చు.

❀ ఈ పరికరం 510 కిలోల బరువుంటుంది.

❀ పంట నూర్పిడి 98 శాతం జరుగుతుంది.

❀ పరికరం 1250 మి.మీ. వెడల్పు ఉంటుంది.

❀ 100–120 మి.మీ. లోతుకు త్రవ్వి వేరుశనగ మొక్కలను పీకుతుంది.

### ముఖ్యాంశాలు :

❀ ఇటువంటి ఇతర పరికరాలతో పోలిస్తే ఇది వేరుశనగ పంటను త్రవ్వి తీయటమే కాకుండా కాయలను శుభ్రం చేసి



పెడుతుంది.

❀ ఇతర పరికరాలకన్నా కాయలు దెబ్బ తినకుండా చాలా సమర్ధవంతంగా పని చేస్తుంది.

❀ ఈ సాధనంతో గంటకు ఒకటిన్నర ఎకరాల్లో వేరుశనగను పీకి కాయలు వేరు చేస్తుంది.

❀ ఇది అన్ని రకాల భూముల్లో పని చేస్తుంది.

### పురస్కారాలు :

❀ ఇన్నోవేటర్ సంజయ్ కుమార్‌కు ఎన్.ఐ.ఎఫ్. వారు 7వ జాతీయ ఇన్నోవేషన్ పోటీలలో బహుమానమే కాక, 2013లో ఉత్తమ సాంకేతిక జ్ఞాన పురస్కారం కూడా లభించింది.

❀ 2004 లోనే పేటెంటుకు నమోదు చేయటం జరిగింది.

**కావలసిన వారు సంప్రదించండి :**

**వీరరాఘవ రెడ్డి : 8125799904**

**సుభాష్ చందర్ : 9652801700**

## 'పల్లెసృజన' పత్రికను ఇతరులూ చదివేలా చేయండి

ఇటీవల ఓ వ్యక్తి ఒక తాను అమలు చేస్తున్న వినూత్న పద్ధతిని మాతో పంచుకున్నాడు. తాను 'పల్లెసృజన' పత్రికను పూర్తిగా చదివిన తర్వాత ఒక 'మంగలి షాపు'లో వుంచుతానని, అక్కడైతే వెంట్రుకలు కత్తిరించుకోవటానికి వచ్చి వేచి చూస్తున్న వారు చదివే అవకాశాలు ఎక్కువ అని తెలియజేశారు. మీరు కూడా మీ పత్రికను మీరు చదివిన తర్వాత ఇతరులూ చదివే అవకాశం కల్పిస్తే, మరింత మంది పల్లెజ్ఞానంతో సంధానించ బడతారు. కొత్త కొత్త ఇన్నోవేషన్లు వారు మనతో పంచుకునే అవకాశముంటుంది.

అలాగే ప్రస్తుత సమాజంలో ఎన్నెన్నో కొత్త కొత్త సాంప్రదాయాలు చోటు చేసుకుంటున్నాయి. చాలామంది పుట్టినరోజు వేడుకలు, పెళ్ళిరోజు వేడుకలు, శుభ కార్యాలు, పదవీ విరమణ వేడుకలు లాంటివాటిలో 'బహుమతులు' ఇవ్వటం ఆనవాయితీగా, ఓ సాంప్రదాయంగా మారింది. ఈ బహుమతి ఓ వస్తు రూపంగానో, డబ్బు రూపంగా కాకుండా 'జ్ఞానాన్ని పంచేది'గా వుంటే? దాన్ని పుచ్చుకున్న వ్యక్తి ఆ జ్ఞానాన్ని మరో పదిమందికి పంచుతూ మీరిచ్చిన బహుమతిని గురించి ఆనందంగా చెప్పుకుంటాడు కదా! అదీ శాశ్వతా ఆనందాన్నిచ్చే బహుమతి.

ఇలాంటి వేడుకలకు ఇప్పటినుంచి బహుమతిగా 'పల్లెసృజన' చందా మీరు కట్టి వారికి బహుమతిగా ఇవ్వండి పత్రిక వాళ్ళను చేరుకున్నపుడల్లా మీరే జ్ఞాపకానికి వస్తారు. మీ బహుమతి ఒక్కరోజు కాదు, కొన్ని సంవత్సరాల పాటు గుర్తుంటుంది. – ఎడిటర్

**చందా వివరాల కోసం ఈ పత్రిక వెనక కవర్‌పేజి చూడండి.**

# తెలుగు రైతు సృష్టించిన కలుపు నివారణ మూలికా మందు



రైతులు ఎదుర్కొనే అనేక సమస్యలలో ప్రధాన సమస్య కలుపు మొక్కలు. ఇది ప్రధాన పంటకు పోషకాలు అందకుండా చేస్తాయి. కలుపు మొక్కల వలన 34% దిగుబడి తగ్గుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేసారు. ఇది పురుగులు తెగుళ్ళ వలన జరిగే నష్టం కంటే ఎక్కువ. కలుపు మొక్కల నివారణకు సాంప్రదాయక విధానం మనుషులతో పీకించడం. కానీ కూలీలు దొరకనందు వలన పైగా కూలీ రేట్లను రైతులు భరించలేరు. అందువలన ఈ విధానం కష్టసాధ్యంగా వుంది.

రెండవ విధానం కలుపు తీత యంత్రాలు. కానీ వీటిని అన్ని పంటలలో వాడలేము. ఉదా.: వరి పంటలో అసలు ఈ యంత్రాలు వాడలేము. మిగిలిన పంటలలో పరిమితంగా వాడగలము. ఇక మూడవ పద్ధతి రసాయన కలుపు నివారణ మందులు వాడకం. ఇవి కూడా కలుపును పూర్తిగా నిర్మూలించలేవు. ఇవి వాడినా మరలా మనుషులతో కలుపును పీకిస్తారు. పైగా వీటివలన కాన్సరు రావడం, పర్యావరణ కాలుష్యం పెరగడం వలన ప్రభుత్వం వీటిని నిషేధించారు. అయినా రైతులు తప్పనిసరి పరిస్థితులలో వీటిని వాడుతున్నారు.

"రైతులుగా ఈ సమస్య తీవ్రత మాకు తెలుసు కాబట్టి మనవంతుగా ఏదైనా పరిష్కారం కనుగొలాని అనుకున్నాము. నేను మా బృందం మూలికా కలుపు మందు ఎందుకు కనుక్కోకూడదని ఆలోచించాము. కొన్ని మొక్కలు వేర్ల ద్వారా నిరోధక పదార్థాలను వదలి పక్కనున్న మొక్క పెరుగుదలను అరికడతాయి. ఉదా.: పార్థీనియం లేదా కాంగ్రెసు గడ్డి లేదా వయ్యారి భామ అనబడే కలుపు మొక్క ఈ విధంగానే తన ప్రక్కన వున్న మొక్కలను ఎదగనివ్వదు. కొన్ని మొక్కల వేర్లకున్న ఈ లక్షణం మొక్కల ఆకులకు ఎందుకుండదు అని పరిశోధన మొదలు పెట్టాము. కొన్ని చెట్ల ఆకుల రసాన్ని ఇతర మొక్కలు అంటే కలుపు మొక్కలమీద వేస్తే అవి మాడిపోయి చనిపోయాయి. మా అన్వేషణలో ఇలాంటి లక్షణాలున్న మూడు మొక్కలను గుర్తించాము. వాటినుంచి తయారు చేసిన కలుపు మందు సమర్థవంతంగా పని చేసింది.

**కలుపు నివారణ మందు వాడే విధానం :** వరి పంట నాటు వేయడానికి 1–2 రోజుల ముందు పొలానికి నీరు పెట్టి ఈ మందును పొలమంతా ఇసుకలో కలిపి వెదజల్లాలి. ఆ తరువాత రొటోవేటర్‌తో కలియదున్నాలి. ఇలా చేస్తే వరి పంటకు వచ్చే కలుపు రాదు. కలుపు మొక్కల గింజలను మొలకెత్తనివ్వకుండా చేయడం వలన తొలిదశలోనే కలుపును నివారిస్తుంది. ఇది అన్ని విధాల సురక్షితం. వానపాములు, మిత్ర పురుగులకు ఎలాంటి హాని జరగదు. ఈ మందు మొక్కలనుండి తయారు చేసింది కాబట్టి పంటకు కావలసిన పోషకాలను కూడా అందిస్తుంది. కాబట్టి పంట 10–15% అధికంగా దిగుబడి వస్తుంది. మరింత పరిశోధన కోసం తిరుపతి అగ్రికల్చర్ యూనివర్శిటీ వారి సహకారంతో సెంట్రల్ గవర్నమెంటు పథకం 'రఫ్తార్' ద్వారా ధన సహాయం అందుతోంది. అందువలన దీని ధర తగ్గవచ్చు.

అయితే దీన్ని ఇంతవరకు వరినాటు వేసే పొలాల్లోనే వాడి లాభం పొందడం జరిగింది. అలాగే పండ్ల తోటల్లో కూడా ప్రయోగాలు విజయవంతం అయ్యాయి. ఈ కలుపు మందు ప్రభావం భూమిలో రెండు నెలల వరకు ప్రగాఢంగా ఉంటుందని మా ప్రయోగాల వల్ల తేలింది. మిగతా పంటలపై పరిశోధనలు జరుగుతున్నాయి. ●

**గల్లా చంద్రశేఖర్, ఇన్నోవేటర్, శ్రీకాళహస్తి,**

**ఫోన్ : 9849541674**



# ఇతర రాష్ట్రాల 'పల్లె కబుర్లు'

30202

### గొర్రెలకి, మేకలకి ప్రకృతి వైద్యం

37 సంవత్సరాల కతిరేశన్ (మేలస్థానం గ్రామం, పుదుకుట్టై జిల్లా, తమిళనాడు) తన జీవనోపాధిగా గొర్రెలని పెంచుతుంటాడు. ఈ క్రమంలోనే అతను గొర్రెలు, మేకలకి సంబంధించిన అనేక రోగాలకి ప్రకృతి సిద్ధమైన మూలికా వైద్య చిట్కాలు, స్థానిక గితారీ జాతి వారివద్దనుండి, తన తండ్రి వద్దనుండి నేర్చుకొని తన స్వంత గొర్రెలు, మేకలకే కాక, ఆ ప్రాంతంలోని అనేక మందికి చెందిన జీవాలకి వైద్యం చేస్తున్నాడు.

**విరోచనాలు (గొర్రెలు, మేకలకి):**

**అ)** రైతులు ఎంతో భయంతో చూసే కుస్కుటా తీగ, లేదా బంగారు తీగగా పిలిచే పరాన్నభుక్కు తీగ (దీని నివారణకి తీగల చెట్టుతో తప్ప వేరా మార్గం లేదని చెపుతారు)ని ముద్దగా నూరి వ్యాధి సోకిన జీవాలకి తినిపిస్తూ మంచి గుణం కనిపిస్తుందట.

**ఆ)** సల్లని మజ్జిగలో పసుపు కలిపి దాహం తీర్చటానికని గొర్రెలకి మేకలకి తాగిస్తూ, విరోచనాలు కడతాయంటాడితను.

**ఇ)** పచ్చి కొబ్బరి బోండంలో ఉండే పువ్వు, మొగ్గని మెత్తగా నూరి, 100 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి నీళ్ళ బదులు విరోచనాలు తగ్గేవరకు తాగించాలని చెపుతున్నాడీయన.



30205

### విరిగిన పశువుల ఎముకలకు మూలికా వైద్యం

తమిళనాడులో ఒక మారుమూల పల్లెలో 68 సంవత్సరాల 'నాకూరన్' కి 5 ఎకరాల భూమి ఉంది. జీవనోపాధి కోసం అతను గొర్రెలను , పాడి ఆవులని పెంచుతుంటాడు. ఈయన తనంతట తానే పరిశోధనలు చసి పశువులకి సంబంధించిన అనేక మూలికా వైద్య చిట్కాలు కనుగొన్నాడు. పశువులకి ఎముకలు విరిగినప్పుడు విరిగిన ప్రదేశంలో ముందుగా ఆముదం రాయాలి, ఆ తరువాత మెంతులు, పంచదార కలిపి మెత్తగా నూరి ఆ మిశ్రమానికి పెరుగు జోడించి, ఎముక



విరిగినచోట పూయాలి. వెదురు బద్దలు తీసుకొని విరిగినచోట కట్టు కట్టి ఆ కట్టుపైన మినప పిండి, కోడిగుడ్డు లోని తెల్లసొన కలిపి ఆ కట్టుపైన పూతలా పట్టించాలి. రెండు వారాల తరువాత 50 గ్రా. మిరియాలు, 50 గ్రా. కావి, 50 గ్రా. పంచదార, కొంత తంగచెట్టు బెరడు, కలబంద కలిపి మెత్తగా నూరి ఒక లీటరు నువ్వుల నూనెలో మరిగించి తయారు చేసుకొన్న తైలాన్ని కట్టు తీసేసి దెబ్బ తగిలిన భాగంలో కొద్ది రోజులు పూయాలి. ఈవిధంగా చేస్తే పశువుల విరిగిన ఎముకలు చక్కగా అతుక్కుని మామూలుగా అవుతాయి అంటున్నాడీయన.

**పశువులలో అజీర్తి చేసినప్పుడు....**

పశువులకి అజీర్తి చేసినప్పుడు ఇతడు తానే తయారు చేసుకొన్న ఒక మిశ్రమం యిచ్చి వైద్యం చేస్తుంటాడు. ఆ మిశ్రమంలో 50 గ్రా. అల్లం, రెండు మిరప కాయలు, 10 వెల్లుల్లి రెబ్బలు, 10 గ్రా. వాము, 5 తమలపాకులు,, 50 గ్రా. పసుపు తీసుకొని వీటన్నిటినీ మెత్తగా నూరి, అజీర్తితో బాధపడుతున్న పశువుకి తినిపిస్తే మంచి గుణం కనిపిస్తుందంటాడీయన.

30206

## పశువులలో వచ్చే కొన్ని జబ్బులకు చిట్కాలు

తమిళనాడులోని పుదుక్కోటై జిల్లాకు చెందిన వీరమ్మన్ వ్యవసాయ కూలీగా పని చేస్తూనే ఆవులు, గొర్రెలని పెంచుతుంటుంది. ఆమె తను ఇతరుల నుంచి తెలుసుకున్నది, తన స్వంత అనుభవంతో తెలుసుకున్న వాటితో పశువులకి, మనుషులకి కూడా మూలికా వైద్యం చేస్తుంటుంది.

**పశువులలో గాలికుంటు వ్యాధి నివారణ....**

పశువులలో గాలికుంటు వ్యాధి (ఫుట్ & మౌత్



-ఎఫ్.ఎం.డి.) వచ్చినపుడు రెండు అరటి పళ్ళని నువ్వుల నూనెలో ముంచి పశువుచేత తినిపిస్తే మంచి గుణం ఉంటుంది అంటుందామె. అదే గొర్రెలకైతే ఒక్క అరటి పండు చాలట. ఇంకొక పద్ధతి కూడా చెపుతుందామె. చెరువులోనుంచి చిన్న చిన్న చేప పిల్లలని తెచ్చిచ వాటిని చితక్కొట్టి ఆ ముద్దని కొద్ది నీటిలో 3 రోజులు మురగబెట్టి వడగట్టిన నీటిని పశువుచేత తాగించినట్లయితే ఎఫ్.ఎం.డి. తగ్గిపోతుందంటుందామె.

**చిన్న పిల్లలకి జలుబు చేస్తే....**

చిన్న పిల్లలకి జలుబు చేస్తే ఈమె కొన్ని ముళ్ళ వంకాయలు, కొన్ని వరి లాకలు, కొన్ని తుమ్మ ఆకులు, కొన్ని తులసి ఆకులు తీసుకొని నీటిలో మరిగించి, ఆ కషాయాన్ని 50 మి.లీ. వేపనూనెలో కలిపి రెండు చెంచాలు పిల్లలకి తాగిస్తే జలుబు నయమయిపోతుందంటుందామె.

**పశువులలో జ్వరం, నెమరు వెయ్యకపోవటం.....**

పశువులకి జ్వరం వచ్చినా, లేదా నెమరు వెయ్యకపోయినా వేపగింజలు, కొబ్బరి పీచు నిప్పులపై వేసి ఆ పొగని పశువు ముఖం, శరీరం, వెనకవైపున పట్టిస్తే గుణం కనిపిస్తుందట.

**పశువులలో కడుపుబ్బరానికి చికిత్స......**

పశువులకి కడుపుబ్బరం చేస్తే 10 గ్రా. వాము, 4 తమలపాకులు, 3 వెల్లుల్లిపాయలు, గుప్పెడు మునగాకులు బాగా నూరి, ఆ ముద్దను తినిపించి పశువుకు ఉపశమం కలిగించ వచ్చని ఆమె చెప్పింది.

**పశువుల కడుపులో నులి పురుగులు పడితే చికిత్స....**

పశువుల కడుపులో నులిపురుగులు పడి పశువులు చాలా బాధపడుతుంటాయి. అటువంటి సమయంలో ఎండిన పొగాకుని వేప నూనెలో నానబెట్టి దాన్ని దూది మధ్య ఉంచి తినిపించాలి.

**కీటకాలు కుట్టినప్పుడు చికిత్స.....**

విష కీటకాలు, పాములు, తేళ్లు కుట్టినప్పుడు ఎర్రని దద్దులు వచ్చి మంట పుడుతుంటుంది. అటువంటి సందర్భాల్లో నేల గొలిమిడి లేదా నేల గురుగుడు ఆకు చూర్ణాన్ని చల్లని నీటిలో పరగడుపున తిగితే మంచి ఫలితం ఉంటుంది.

**పశువులలో విరోచనాలకు చికిత్స....**

పశువులు విరోచనాలతో బాధపడుతున్నప్పుడు కిస్కూటా లేదా బంగారుతీగ అనే పరాన్న బుక్కును తీసుకొని





దీనిని బాగా దంచి ఆ ముద్దని మూడు రోజులు తినిపిస్తే విరోచనాల బాధనుంచి పశువులకి విముక్తి లభిస్తుంది అంటుందామె.

30214

**వంగ పంటలో పూత రాలపోవటానికి మందు...**

రాజస్థాన్, దుంగర్‌పూర్ గ్రామానికి చెందిన కతరా బాచూభాయ్ కొంరీ భాయ్ వంగ పంటలో మొక్కలు పూతకి వచ్చి రాలిపోతుంటే నివారించటానికి ఒక చక్కటి చిట్కా చెబుతున్నాడు. పూత రాలిపోయే వంగపంటలో జిల్లేడు ఆకు పొడిని మధ్యాహ్నంపూట 3 రోజులకోసారి 2 లేదా 3సార్లు పొలంలో చల్లితే మంచి ఫలితం వుంటుందని చెబుతున్నాడు. జిల్లేడు ఆకులనుండి తయారు చేసిన రసం లద్దె పురుగు నివారణకి కూడా బాగా పని చేస్తుందట. అంతేకాక ఆకురసం పీల్చే పురుగుల నివారణకు కూడా సహాయకారిగా ఉంటుందట.

30204

**పొలంలో గట్టు కట్టే పవర్ టిల్లర్**

(వైద్యానికి సంబంధించింది కాకపోయినా ఎంతోమంది రైతులకి ఉపయోగకరంగా ఉంటుందని భావించి దీనిని కూడా పొందుపరుస్తున్నాం)

తమిళనాడు రాష్ట్రంలో, దిండిగల్ జిల్లాకి చెందిన 'పంచమ్ పట్టి' గ్రామ నివాసి 'ఆల్బర్ట్' పవర్ టిల్లర్ సహాయంతో పొలాల్లో గట్టు కట్టేలా చేసి చూపించాడు. సాధారణంగా పొలంలో వ్యవసాయం చెయటం ఎంత కష్టమో, పొలానికి గట్టు కట్టుకోవటం అన్నది ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. దానికి సులువైన ఉపాయం చూపించాడు మన ఆల్బర్ట్. 13 హెచ్.పి. మోటారుతో పనిచేసే ఈ టిల్లరు 60 సెం.మీ. వెడల్పు, 22 సెం.మీ. ఎత్తు వున్న గట్లు కట్టగలదు. గంటకి ఒక లీటరు డీజిల్ ఖర్చయ్యే ఈ టిల్లర్‌తో ఒక ఎకరం పొలానికి 2 గంటల్లో గట్టు కట్టుకోవచ్చు. సాధారణంగా ఇంతపని చెయ్యటానికి 10 మంది పనివాళ్ళు కావలసి వస్తారు. (ఎంత కూలీ ఖర్చు అవుతుందో గమనించండి) ఇంగ్లీషు అక్షరం 'వి' (V) ఆకారంలో ఉండే పరికరం 75 సెం.మీ. వెడల్పు, 45 సెం.మీ. ఎత్తు ఉంటుంది. రూ. 40,000/-ల ఖరీదు చేసే ఈ పరికరాన్ని ఆర్డర్ దాదాపు 20 మంది రైతులకి ఇప్పటికే విక్రయించాడు. అంతా బాగా పని చేస్తోంది అంటున్నారట.



# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 12 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 12వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెలికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2021** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :

**National Innovation Foundation,**

**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**

**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

సూచన : వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040-27111959) సంప్రదించండి.

# డా. ఎపిజె అబ్దుల్ కలాం 'ఇగ్నైట్-2019' పోటీ విజేతలు




## జారినా పడిపోకుండా కాపాడే మెట్లు

విద్యార్థి పేరు : **అనుజ్ మిశ్రా, 9వ తరగతి, విద్యావాహిని పబ్లిక్ స్కూల్, మీర్జాపూర్, ఉత్తరప్రదేశ్.**



వయస్సు మీదపడిన తర్వాత మెట్లు ఎక్కటమో, దిగటమో చాలా ప్రయాసతో కూడుకున్న పనవుతుంది. ఇది 'నీ' 'నా' అనే భేదం లేకుండా అందరికీ ఇంతే. చాలామంది వయో వృద్ధులు మెట్లు ఎక్కేటప్పుడో లేదా దిగేటప్పుడో కాలు తడబడి, జారి చాలా ప్రమాదకరమైన దెబ్బలకి గురౌతుంటారు. కొన్ని సందర్భాలలో ప్రాణాంతకంగా కూడా అవుతూంటుంది.

అటువంటి వారికి సహాయకారిగా ఉండటానికై ఉత్తరప్రదేశ్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి అనుజ్ మిశ్రా ఒక ఉపాయం చేశాడు. ఇతడు మెట్ల పొడవునా సెన్సార్లు మరియు మెత్తటి కుషన్‌లు ఏర్పాటు చేసిన పార్టీషన్ చెక్కలు ఏర్పాటు చేశాడు. ఎవరైనా మెట్లు దిగేటప్పుడు రెయిలింగ్‌ను కాని, గోడను కాని పట్టుకోక పోయినా మెట్లపైన అకస్మాత్తుగా బరువులో ఒడిదుడుకులు (జారినట్లు, తడబడునట్లు) ఏర్పడినప్పుడు మెట్లపైన అమర్చిన సెన్సార్లు ఎవరో పడిపోతున్నారని గ్రహించి, ముందుగా మెత్తని కుషన్‌తో ఏర్పాటు చేసిన బారికేడ్లను ముందుకు గెంటి జరుపుతుంది. దానిని పట్టుకొని పడిపోతున్న వ్యక్తి నిభాయించుకోవచ్చు.

అనుజ్‌కి చిన్నప్పటినుంచీ తన చుట్టూ ఉండే



వస్తువులని విప్పదీయడం, బాగు చెయ్యటం అంటే సరదా. ఏది ఎలా పని చేస్తుందో తెలుసుకోవాలనే కుతూహలం ఎక్కువ. సమయం దొరికినప్పుడల్లా తన మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతుంటాడు. ఆ అద్భుతమైన తెలివికల అనుజ్ పెద్దయ్యాక ఇంజనీరై ప్రజలకి ఉపయోగపడే వస్తువులు తయారు చెయ్యాలనుకుంటున్నాడు. శుభం!

## గీసిన చిత్రాలకి రంగులతో, గీతలతో (షేడ్) నింపే పరికరం

విద్యార్థి పేరు : **రక్తమ్ దాస్, 10వ తరగతి, శంకర్‌దేవ్ శిశు విష్యనికేతన్, దాదర, కామరూప్ జిల్లా, అస్సామ్.**



చాలామంది నిపుణులకి బొమ్మలు గీసే వృత్తి కళాకారులకీ చిత్రాలు, పెద్ద అక్షరాలు గీయటం, వ్రాయటం ఒక ఎత్తైతే, దానిని రంగులతో నింపడం, లేదా గీతలో షేడింగ్ ఇవ్వటం తలకి మించిన పనవుతుంటుంది. గీసిన చిత్రకన్నా దీనికి ఎక్కువ సమయం పడుతూ ఉంటుంది. వేళ్ళలో లేదా మణికట్టులో సమస్య ఉన్నవారికి ఇది మరీ కష్టంగా ఉంటుంది.

ఈ సమస్యని పరిష్కరించటానికి అస్సామ్‌లో 10వ తరగతి చదువుతున్న రక్తమ్‌దాస్ సులభంగా పని చేసే ఒక చవకైన పరికరాన్ని రూపొందించిచాడు. వేళ్ళు కదల్చనవసరం లేకుండా, రంగులు, గీతలు, షేడ్లు చెయ్యటానికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

ఈ అబ్బాయికి తన వయసు పిల్లలు చాలామందిలో సెల్‌ఫోన్‌లో కాలం వృధా చెయ్యటం ఇష్టముండదు. మైదానంలో ఆడే క్రికెట్, ఫుట్‌బాల్ లాంటి ఆటలంటే చాలా ఇష్టం దాసుకి. కొత్త వస్తువుల గురించి ఆలోచించటానికి రూపకల్పన చెయ్యటంలో ఎక్కువ సమయం గడుపుతూ ఉంటాడు. పెద్దయ్యాక ఎలక్ట్రానిక్స్ ఇంజనీరై, సెన్సార్ ఆధారంగా పనిచేసే వస్తువులు తయారు చేసి, మన జీవితం సులభతరం చెయ్యాలనుకుంటున్నాడు మన రక్తమ్‌దాసు. మంచి ఆలోచనే కదా!

## సులభంగా శుభ్రపరచడానికి వీలయ్యే వాటర్ ట్యాంక్

విద్యార్థి పేరు : **సిద్ధాంత కుమార్, 9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రణాబీగా, నలంద జిల్లా, బీహార్.**



బడైనా, గుడైనా, కార్యాలయమైనా, ఆసుపత్రి అయినా, సినిమా హాలయినా, హెూటలయినా మానవులు వాడే ఏ భవనానికైనా నీళ్ళ ట్యాంకు ఉండడం తప్పనిసరి. దాన్ని తరచూ శుభ్రం చేయటం కూడా ఎంతో అవసరం. కానీ ఇది అనుకున్నంత సులభం కాదు. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. వ్యయం తక్కువైనా ప్రయాస మాత్రం ఎక్కువే అని చెప్పవచ్చు.

ఈ నీళ్ళట్యాంకుని శుభ్రం చేసే సమస్యను సులభతరం చెయ్యటా నికి బీహార్ రాష్ట్రంలోని నలంద జిల్లాలో 9వ తరగతి చదువుతున్న సిద్ధాంత ఒక ఆలోచన చేశాడు. నీళ్ళ ట్యాంకులలో కొన్ని రోజులకి క్రింది భాగంలో చెత్త పేరుకొని పోవటం సహజం. ట్యాంకు అడుగు భాగంలో వున్న మురికి నీటిని శుభ్రం చెయ్యటం చాలా కష్టం. ఇతని ఆలోచన





ప్రకారం క్రింది భాగం ఒకవైపు వాలుగా ఉంటే చెత్త, నీరు ఆ వాలుగా వుండే వైపునుంచి విడిగా ఏర్పాటు చేసిన పైపు ద్వారా బైటకు తీసివెయ్యవచ్చు అంటాడు.

సిద్ధాంత కుమార్‌కి చిత్రలేఖనం అంటే చాలా ఇష్టం. పెద్దయ్యాక తానొక పోలీసు అధికారిని అవుతానని, పేదలకు, నిస్సహాయులకు ఆసరాగా నిలుస్తానని అంటాడు. చాలా మంచి ఆలోచన కదా....!



## కోల్ పంటలను సులభంగా కోసే పరికరం

విద్యార్థి పేరు : **యాష్ ప్రమోద్ జాదవ్, 10వ తరగతి, శారదాబాయ్ పవార్ విద్యాలయ, శివనగర్, పూణే, మహారాష్ట్ర.**



కోల్ పంటలు అంటే భూమిలోపలి దుంపలు కాక మొక్క చివరన కాచే పళ్లు, కాయలు కాక, మొక్కల కాండాన్నే ఆహారంగా ఇస్తాయి. ఉదాహరణకు కచెబ్, క్యాలీఫ్లవర్, బ్రకోలీ, పాలకూర లాంటి ఆకు కూరలు మొదలైనవి. ఈ పంటలని చాలా వరకు చేతులతోనే కోయాల్సి వస్తుంది. ఈ ప్రక్రియ చాలా శ్రమ, వ్యయ ప్రయాసలతో కూకుడొన్నది. కూలీలు దొరకని రోజుల్లో మరీ కష్టమయి పోతుంది. ఈ పనిని సులభంగా చవకగా శ్రమ లేకుండా తక్కువ సమయంలో చెయ్యడానికి తన తండ్రి పొలంలోనే ఆయనకి సహాయ కారిగా ఉండటానికి చేతితోనే పనిచేసే ఒక పరికరాన్ని కనుగొన్నాడు మహారాష్ట్ర, పూణేలో 10వ తరగతి చదువుతున్న యాష్ ప్రమోద్ జాదవ్.

ఇతనికి వాలీబాల్, క్రికెట్ ఆటలంటే చాలా ఇష్టం. అంతేకాక వక్తృత్వ పోటీలలో, చర్చల్లో పాల్గొనటమూ ఇష్టమే. తన తండ్రికి ఈ కోల్ పంటలను సులభంగా కత్తిరించే యంత్రాన్నే కాక, ఇతను జామకాయలు, నిమ్మకాయలు కోసే యంత్రాన్ని కూడా రూపొందించాడు.

చిన్నతనంలోనే ప్రతిభ కనపర్చాడు. పెద్దయ్యాక ఇలాంటివి ఇంకెన్నో కనుగొనాలని ఆశిద్దాం.

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

**దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.**



సోలార్ సెల్ ఛార్జర్



వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు



శ్రీతైలం


హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 96528 01700.
గూగుల్ మ్యాప్‌లో 'పల్లెసృజన' అని వ్రాస్తే మార్గం మీకు చూపిస్తుంది

పిల్లలు తమ తెలివి తేటలతో బహుమతి గెలుచుకునే అవకాశం!

సృజనశీలురైన పిల్లలకి డా. ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ గారి పేరున

# "ఇగ్నైట్ మైండ్" పోటీలు



...... పిల్లలని మన ఉపదేశాలు వినే మర బొమ్మలుగా కాక స్వంత ఆలోచనలున్న వారిగా తీర్చి దిద్దండి.

**మీకు 19 సంవత్సరాలకన్న తక్కువ వయస్సు ఉండి దైనందిక సమస్యలకు పరిష్కారాలు చూపే సాంకేతిక ఆలోచనలు ఉంటే వాటిని ignitedmind@honeybee.org ద్వారా వెంటనే మాకు పంపండి.**

**....... ఆఖరు తేది 15 సెప్టెంబర్, 2020**

మీ ఆలోచన పని చేస్తున్నది లేనిది నిరూపించే ఋజువు/ నమోనా మీవద్ద లేకపోయినా ఫరవాలేదు. ఉంటే బహుమతి గెలుచుకొనే అవకాశాలు మెరుగు పడతాయి. పిల్లల తల్లిదండ్రులకి, అధ్యాపకులకు ఒక విన్నపం. దయచేసి మీ ఆలోచనలు పిల్లల పేరున పంపకండి. మీకై ప్రత్యేకంగా వేరే పోటీలున్నాయి. వాటి వివరాలు HBNCRIIA@honeybee.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

పిల్లలు తమ స్వంత ఆలోచనలని ఎవరి సహాయం లేకుండా వారే పంపేవిధంగా ప్రోత్సహించండి.

www.csir.res.in www.sristi.org www.gian.org

# ఆయుర్వేద జ్ఞాన మథనం
# ఆహారం సగం బలం



అవగాహనా లోపం వల్ల చాలామంది తమ ఆహారం విషయంలో చాలా అజాగ్రత్త వహిస్తే మరి కొందరు అతి భద్రతా లోపం వల్ల ఇవి తాని, ఇవి తినకూడదు, ఈ కూరలు తినాలి, పప్పు చారు వాడాలా వద్దా, పంచదార, బెల్లం ఎక్కువ తీసుకోవటం వల్ల సమస్యలేమి ఇలా రకరకాల అపోహలకు గురవుతూ వుంటారు. అందుకే మనం ఏ రకమైన ఆహారం తీసుకోవాలి? వాటివల్ల లాభాలేమిటి అన్నది ఈ వ్యాస సారాంశం.

మన శరీరంలోని అన్ని భాగాలు మన ఆహారంతోనే ముడిపడి వుంటాయి. ఆరోగ్యంగా ఉండాలంటే మనం తినే తిండి మంచిగా వుండాలి. కొంతమంది ఖరీదైన పదార్థాలు తింటేనే ఆరోగ్యంగా ఉంటామని అంటుంటారు. ఉదా.: ఆపిల్, అంజీర్ లాంటి పండ్లు ఎక్కువగా తినాలి, వాటిల్లోనే మంచి పోషకాలు ఉంటాయి అంటుంటారు. తక్కువ ఖరీదులో లభించే బొప్పాయి, మామిడి లాంటి వాటిల్లో కూడా ఉంటాయి. మామిడి పండ్లకన్నా 'కాయలు' ఎప్పుడు లభించినా ఎంతో కొంత తినటం వల్ల క్యాన్సర్ నిరోధకంగా పని చేస్తుంది. మామిడి పండ్లు ఎక్కువగా తింటే జబ్బు గానీ, కాయలు 365 రోజులూ తిన్నా ఏమీ అవదు. ఆపిల్ పండులో ఎన్ని రకాల పోషకాలు వున్నాయో, బొప్పాయిలో కూడా అన్ని రకాల పోషకాలు ఉన్నాయి.

ఈమధ్య కొంతమంది అపోహ ఏమిటంటే దంపుడు బియ్యం తింటే ఏమిటి, మరికొంతమంది వాటిని తినలేము తెల్ల బియ్యమే మంచిదని, ఉప్పు బియ్యం తింటే మంచిదని వాదనకు దిగుతున్నారు. వడ్లను మిల్లులో వెయ్యగానే ముందుగా పై పొట్టును వలిచి వేస్తుంది. వాటినే దంపుడు బియ్యం అంటారు. పూర్వం వడ్లను దంచుకుని తినేవారు. ఇప్పుడు దంచేవారు లేరు కాబట్టి మిల్లులో కేవలం పొట్టు వలిచిన బియ్యాన్ని దంపుడు బియ్యంగా వాడవచ్చు. అందులో పైపొరలో ఎన్నో రకాల విటమిన్లు వుంటాయి. ఆ తర్వాత పొరలో మినరల్స్ వుంటాయి. ఆ తర్వాత పొరలో ఫైబర్ వుంటుంది. ఆ పొర కూడా తొలగిస్తే లోపల ఉండే బియ్యం తెల్లగా వుంటుంది కానీ, అందులో షుగర్ మాత్రమే వుంటుంది. భేషజాల కోసం పాలిష్... పాలిష్ అని పై పొరలన్నీ మిల్లులో పోయేలా చేసి, లోపల వున్న తెల్లటి బియ్యం మాత్రమే ఉండేలా చేసుకుని తినే అన్నంలో షుగర్ తప్ప ఏమీ ఉండదు. ఈ మూడు రకాల పొరలు తొలగించుకుని తెల్లటి బియ్యంతో అన్నం చేసుకుని తినటం వల్ల ఇన్ని రకాల సమస్యలకు గురవుతున్నారు మనుషులు. కాబట్టి ఎంత తక్కువ పాలిష్ చేసిన బియ్యం తింటే అంత మంచిది.

ఆ తర్వాత మసాలాలు కూరలలో తప్పనిసరిగా వేసుకుంటే ఆరోగ్యం. కానీ చాలా తక్కువ మోతాదులో వేసుకోవాలి. ఎక్కువ మసాలాలు కలిగిన ఆహార పదార్థాలు తినటం వల్ల ప్రేవుల్లో పుండ్లు ఏర్పడే అవకాశాలు ఎక్కువ. ఈ మసాలాల వల్లే రక రకాల అల్సర్లు లాంటి జబ్బులు వస్తుంటాయి. కాబట్టి మసాలాలు తినాలి కానీ, ఎక్కువ తినకుండా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. మసాలాల్లో లవంగం, దాల్చిన చెక్క లాంటివి కొద్దిగా వాడినా ఫర్వాలేదు కానీ, మరీ ముఖ్యంగా అల్లం, వెల్లుల్లి మాత్రం ఎక్కువగా ఉపయోగించరాదు. అల్సర్లతో బాధపడే వారు మజ్జిగ

ఎక్కువగా వాడటం వల్ల వారా సమస్య నుండి కొంత ఉపశమనం పొందవచ్చు.

ఇక నూనెల విషయానికి వస్తే.... పూర్వం నూనెలు మన ఆహారంలో తీసుకునేవి చాలా తక్కువ. వేరుశనగ నూనె, కుసుమ నూనె, నువ్వుల నూనెలు మాత్రమే ఎక్కువగా ఉపయోగించేవారు. కేరళ లాంటి ప్రాంతాల్లో కొబ్బరి నూనె ఎక్కువగా తీసుకునే వారు. అవి కూడా గానుగల్లో పట్టిన నూనెనే నేరుగా వాడేవారు. కానీ, ప్రస్తుతం మార్కెట్లో ఎన్నో రకాల నూనెలు విస్తృతంగా లభిస్తున్నాయి. వాటిల్లో రిఫైన్డ్ నూనెలు అని, డబుల్ రిఫైన్డ్ నూనెలు అని నూనెల్లో వున్న శరీరానికి పనికి వచ్చే పదార్థాలన్నింటిని తీసివేసి పిప్పి నూనెలను మాత్రమే వినియోగించేలా ప్రమాదకర స్థాయిని సృష్టించారు వ్యాపారులు. పైగా వైద్యులచేత ఈ నూనెలే హృదయానికి మంచివి అని ప్రచారం చేయించి మరీ అమ్ముకుంటున్నారు. మనం తినే ఆహారంలో లభించే క్యాలరీలు కనీసం 20 శాతం నూనెల వల్లనే లభిస్తాయి. ఈ క్యాలరీలు అన్నీ తీసివేసిన నూనె మన శరీరానికి ఎలా మంచి చేస్తుంది? క్రొవ్వు, ఆమ్లాలు కూడా శరీరానికి చాలా అవసరం అన్న విషయం గమనిస్తే మంచిది. మన శరీరానికి 'ఎ', 'బి', 'ఇ', 'కె' విటమిన్లు కూడా అవసరం. అలాంటి వాటిని శరీరానికి కావలసినంతగా అందించి మిగతా వాటిని తీసివేసేది క్రొవ్వు పదార్థం మాత్రమే. కాబట్టి క్రొవ్వు కూడా శరీరానికి తప్పకుండా అవసరమే. అందుకు వేరుశనగ, కుసుమ, నువ్వుల నూనె, కొబ్బరి నూనెలు మాత్రమే శరీరానికి మంచివి. మిగతావి అంతగా ఉపయోగ పడవు. డాల్డా శరీరానికి అస్సలు మంచిది కాదు. అలాగని రోజూ నూనెతో వేపుళ్ళు చేసుకుని తిన్నా ప్రమాదమే. తగినంత నూనెలు గానుగ నూనెలు మాత్రమే వినియోగిస్తే మంచిది. పైగా రిఫైన్డ్ ఆయిల్ వంటల్లో ఎంత వాడినా కనపడదు కానీ, గానుగ నూనె కొద్దిగా వాడినా ఎంతో నూనె వేసుకున్నట్లు వుంటుంది. రోజూ మనిషికి 20 గ్రాముల వరకు నూనె తప్పనిసరిగా అవసరం. అది కూడా వేరుశనగ, నువ్వులు, కుసుమ, కొబ్బరి నూనెలు అయితే మంచివి.

ఇక నీళ్ళు. ఈ నీటిని గురించి ఒక్కోరు ఒక్కో రకంగా చెప్పడం వల్ల కొందరు 4-5 లీటర్ల నీరు త్రాగితే, కొందరు 1-2 లీటర్ల నీరు త్రాగుతున్నారు. మనం తినే ఆహార పదార్థాలైన రసం, సాంబారు, మజ్జిగ లాంటి వాటిలో కూడా నీరు వుంటుంది కాబట్టి రోజుకి మనం రెండున్నర, మూడు లీటర్ల నీటికి మించి తాగటం మంచిది కాదు. ఎందుకంటే మిగతావి మనం తాగే కాఫీ, టీ, ఆహార పదార్థాల ద్వారా కూడా కొంత నీరు శరీరానికి అందుతుంది. ఆ నీటిని కూడా ఆహారం తినేటప్పుడు అవసరమైనంత మాత్రమే మధ్య మధ్యలో తీసుకోవాలి కాని, ఎక్కువ నీరు ఆహారం మధ్యలో తీసుకోవటం మంచిది కాదు. ఆహారం తినటం పూర్తయిన తర్వాత నీరు తీసుకుంటే మంచిది.

ఆ తర్వాత పంచదార గురించి తెలుసుకుందాం. పంచదార ఎక్కువగా తింటే 'షుగర్' వ్యాధి వస్తుందని ఒక అపోహ వుంది. షుగర్ వ్యాధి పంచదార కన్నా, ఉప్పు ఎక్కువగా వాడటం వల్ల వస్తుంది. ఉప్పుని కాస్త తగ్గించుకుని పంచదార తిన్నా ఫర్వాలేదు. కానీ పంచదార కన్నా బెల్లం శ్రేష్ఠమైనది. బెల్లం తినటం వల్ల శరీరానికి ఉపయోగమే తప్ప, నష్టాలు దాదాపుగా వుండవు. పంచదార కూడా కొంత వరకు శరీరానికి హాని చేసేదే. ఉప్పులో కూడా సాధారణ ఉప్పుకన్నా, సైంధవ లవణం ఉపయోగించటం శరీరానికి ఎంతో మంచిది. ఏ ఆహారం తీసుకున్నా, శరీరానికి శ్రమ అవసరం కాబట్టి కూర్చుని తినకుండా ఎంతో కొంత శారీరక శ్రమచేస్తే శరీరానికి ఒంటబడుతుంది.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854

**శ్రీ గణేశం గారికి నమస్కారములు,**

ఈరోజు నేను ఒక కవర్ రిజిష్టర్ పోస్టులో పంపేందుకు పోస్ట్ ఆఫీస్ దగ్గరకు వెళ్లాను. అక్కడ మా పోస్ట్ మాస్టర్ గారిని 'పల్లెసృజన' పుస్తకము హైదరాబాద్ నుండి పంపించారు. కానీ నాకు ఇంత వరకు తెచ్చి ఇవ్వలేదు వచ్చి వుంటే ఇవ్వండి అని అడిగాను. మే–జూన్ 2020 సంచిక నాకు రాలేదు అంటే మీరు పంపిన రెండు పత్రికలు ఇచ్చారు. సాధారణ పోస్ట్ కావడం వల్ల పోస్ట్‌మాన్ ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు అని తెలిసింది. నాకు అందలేదని మీకు తెలియజేయడంతో మీరు రెండుసార్లు పంపడం జరిగింది. ఇంతటి విలువైన పత్రికలు వృధాగా ఉండరాదు కాబట్టి నావద్ద అదనంగా వున్న పుస్తకాలను తోటి రైతులకు ఇచ్చి, ఈ పత్రిక ప్రాధాన్యతను వారికి తెలియజేసి, ఈ పుస్తకానికి చెందా కట్టమని సిఫారసు చేస్తాను. ధన్యవాదములు.

**– డి. సురేంద్ర రెడ్డి, ఫోన్ : 9441191317**

**సురేంద్ర రెడ్డి గారు,**

'పల్లెసృజన' మనోభావాలను మీ మాటల్లో వింటున్నందుకు ఆనందంగా వుంది. ఈ పత్రిక వృధాగా పడివుండరాదు, ఎవరో ఒకరికి ఇది ఉపయోగ పడాలి అన్న మీ అభిప్రాయానికి సదా కృతజ్ఞులం. పత్రిక అందలేదని మాకు ఎవరు ఫోన్ చేసినా వెంటనే మరో కాపీ పంపుతాము. మీరన్నట్లు పోస్టల్ శాఖలో కొంత కరోనా వల్ల సిబ్బంది తక్కువ అయిన కారణంగా కొంతమంది పాఠకులకు పత్రిక చేరటం లేదు. ఈ పరిస్థితి త్వరలో మెరుగవుతుందని ఆశిద్దాం. మీలా ప్రతి 'పల్లెసృజన' పాఠకుడూ ఆలోచిస్తే, పల్లెసృజన పత్రిక తెలుగు ప్రజల్లో త్వరగా విస్తరిస్తుందని మా విశ్వాసం.......

**– బ్రిగేడియర్ గణేశం.**

**FORM IV**

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

గ్రామీణ సృజనా శక్తికి వెలుగురూపం వేదిక
పల్లెసృజన
www.pallesrujana.org

# అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

## అడవి పందులను పారద్రోలే అలారం



చాలామంది రైతులకు అడవి పందుల నుండి ఎంతో పంట నష్టం జరుగుతోంది. అవా రాత్రి పగలు అనే తేడా లేకుండా పంటలను విపరీతంగా నాశనం చేస్తూ వుంటాయి. అటువంటి రైతుల నష్టాలను తీర్చడానికి, పంటలకు సులభమైన రక్షణ సాధనం ఈ 'అడవి పందులను పారద్రోలే అలారం'. దీన్ని పొలంలో ఏర్పాటు చేస్తే ప్రతి 5 లేదా 10నిమిషాలకు ఒకసారి చొప్పున రకరకాల శబ్దాలు చేస్తూ అడవి పందులు ఆ పొలం ప్రాంతాలకు రాకుండా నివారిస్తుంది.

## కొబ్బరి చెట్లను ఎక్కే పరికరం



కొబ్బరి చెట్లను ఎక్కడం అందరికీ చేతకాదు. దానికో ప్రత్యేక శిక్షణ, ధైర్యం కలిగిన వ్యక్తులు అవసరం. అందుకే ఎవ్వరైనా సరే చెట్టు ఎక్కేలా, ఎక్కిన తర్వాత అక్కడ కూర్చుని పనిచేసుకునేలా రూపొందించిన ఈ పరికరంతో కొబ్బరి చెట్లను సులభంగా ఎక్కి చెట్టుపైన వున్న పంటను దానిపైనే కూర్చుని కోసుకోవచ్చు.

## టమోట నిల్వ చేసే సహజ ద్రావణం




టమోట రైతులు ఒక్కోసారి ధర లేకపోవటం వల్ల నష్టపోతూ వాటిని పారవేస్తూ వుంటారు. సుమారు నెల రోజుల వరకు టమోట నిలువ చేసే ఆకుల రసాలతో తయారు చేయబడి ఈ సహజ ద్రావణం రైతుల నష్టాలను అరికడుతుంది. ఇందులో ఎటువంటి రసాయనాలు లేవు. రైతులు దీన్ని సునాయాసంగా ఉపయోగించుకొని సాధారణ గది ఉష్ణోగ్రతలో తమోట పండ్లు పాడు కాకుండా కాపాడుకోవచ్చు.

## జొన్న రొట్టెలు, చపాతీలు చేసే యంత్రం



ఇవి మూడు మాడళ్ళలో లభిస్తాయి. పని సామర్ధ్యతను బట్టి, అనుకూలతను బట్టి మీకు కావలసిన మాడల్‌ను ఎన్నుకోవచ్చు. ❀ స్టెయిన్‌లెస్ స్టీలు బాడీ ❀ యంత్రం బరువు మాడల్‌ను బట్టి 12 నుండి 70 కిలోల వరకు బరువుంటాయి. ❀ విద్యుత్తు విని యోగం 'సింగల్ ఫేస్', 8–10 గంటలకు ఒక యూనిట్. ❀ తయారీ సామర్థ్యం మాడల్‌ను బట్టి 30 నుండి 500 వరకు రొట్టెలు/ గంటకు ❀ రొట్టె మందం అవసరాన్ని బట్టి మార్చుకోవచ్చు ❀ ప్లేటు సైజు 9–10 అంగుళాలు ❀ యంత్రం బరువు మాడల్‌ను బట్టి 15–70 కిలోలు ❀ ఒక సంవత్సరం వారంటీ.

<u>వివరాలకు సంప్రదించండి :</u>

**క్రియేటివ్ మైండ్స్, ఫోన్ : 9652801700**

PALLE SRUJANA Telugu Bi-monthly July - August 2020 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?


ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే




























పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

Pay by "Phone Pe" to 9866 00 1678

PhonePe

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం |
|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- |
| ఐదు సంవత్సరాలకి | 1,000/- |

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

లేదా 'ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9866 00 1678 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

QR code for Phone Pe

Scan & Pay Using PhonePe App